కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :154 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | మంగళవారం 06-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

భారత ప్రజాస్వామ్య వ్యవస్థను చూసి కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతోంది



హైదరాబాద్,కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు, ఎన్నికల సంఘం మంచివి.. ఓడిపోతే మాత్రం నిందలా?తెలంగాణలో చొరబాటుదారుల ఓట్లను తొలగిస్తుంటే ఓటమి భయంతో 'ఇండి' కూటమి విష ప్రచారం చేస్తోంది.రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక పాలనకు ప్రత్యామ్నాయం భారతీయ జనతా పార్టీ మాత్రమే.హిందూ దేవాలయాలపై వరుస దాడులు జరుగుతుంటే నిందితులకు 'మతిస్థిమితం లేదు' అంటూ తప్పించే కుట్రలు పరిపాటిగా మారాయి.అక్టోబర్ 7న తెలంగాణలోని జిల్లా కేంద్రాల్లో 'సేవా జ్యోతి యాత్ర', 'వికసిత్ భారత్ సంకల్ప సభ'లను విజయవంతం చేయాలి.భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు , బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్. గౌతం రావు , వీరేందర్ గౌడ్ , వేముల అశోక్ , బిజెపి తెలంగాణ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, సంస్థాగత సంయుక్త ప్రధాన కార్యదర్శి దశరథ్ , కర్ణాటక రాష్ట్ర సహ ఇన్‌ఛార్జ్ డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు , మరియు రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు దిశానిర్దేశం చేశారు.భారత ఎన్నికల వ్యవస్థపై ప్రపంచం గర్విస్తుంటే.. కాంగ్రెస్ ఏడుస్తోంది:ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత విజయవంతమైన ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం నిలిచిందని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం ప్రధాని నరేంద్ర మోదీ తో మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం పనితీరును, ఎలక్షన్ గుర్తింపు కార్డులతో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించే విధానాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారని గుర్తుచేశారు. యావత్ ప్రపంచం మన ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రక్రియను చూసి గర్విస్తుంటే.. కాంగ్రెస్ పార్టీ మాత్రం దేశంపై, ఎన్నికల సంఘంపై ఏడుస్తూ అవాకులు చవాకులు పేలుతోందని మండిపడ్డారు. ఒక సాధారణ చాయ్‌వాలా దేశానికి ప్రధానమంత్రి కావడాన్ని ఆ పార్టీ జీర్ణించుకోలేకపోతోందని, నెహ్రూ కుటుంబం నుంచే ప్రధాని కావాలనే సంకుచిత భావనతో దేశంలో జరిగిన ఎన్నికలన్నీ చెల్లవంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఎన్నికలు చెల్లవనుకుంటే.. మొదట తెలంగాణలో అక్రమంగా గెలిచిన రేవంత్ రెడ్డి చేత, అలాగే కేరళం, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రుల చేత రాజీనామాలు చేయించాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో తాము గెలిస్తే ఈవీఎంలు, ఈసీ మంచివని.. ఓడిపోతే మాత్రం వాటిపై నిందలు వేయడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని తీవ్రంగా మండిపడ్డారు.

ఓటును తొలగించడం రాజ్యాంగ విరుద్ధం



హైదరాబాద్, ఓటు హక్కును తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఎమ్మెల్యేగా అనార్హత వేటు పడడంతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో దానం సుడిగాలి పర్యటన చేస్తున్నారు. స్థానిక వాసులతో సమావేశం అవుతూ సమస్యల పరిష్కారం పై దృష్టి సారించారు. కుందన్‌బాగ్ మెథరిస్ట్ కాలనీ, ఉమా నగరాల్లో స్థానిక కాలనీవాసులతో సమావేశం అయినా దానం అక్కడి సమస్యలు వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఆయా ప్రాంతాలలో డ్రైనేజీ సమస్య, మంచినీటి సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేయడంతో వాటర్ వర్క్స్ అధికారులను పిలిచి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ దేశవతంగా ఓటు చోరీ జరగడం విచారకరమని అన్నారు. వ్యక్తులుగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ఓటు హక్కు తొలగినట్లు గుర్తిస్తే తక్షణమే అధికారులను ఓటును తిరిగి తీసుకోవాలని సూచించారు. ఓటు హక్కు లేని వారు ప్రశ్నించే హక్కు కోల్పోతారని అన్నారు. ఓట్ల తొలగింపు పై నియోజకవర్గ ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. విజయ రెడ్డి పిటిషన్ పై గతంలోనే తాను అఫిడవిట్ దాఖలు చేసినట్టు చెప్పారు.

ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..



హైదరాబాద్,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే ఎన్. స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టు లో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఓటుకు నోటు కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో జరుగుతున్న విచారణలో తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని, తనకూ అదనపు వాదనలు వినిపించే అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ ఈ పిటిషన్‌లో కోరారు. ఈ కేసులో ఫిర్యాదుదారుడిగా, కీలక బాధితుడిగా ఉన్న తన వాదన వినడం న్యాయపరంగా ఎంతో కీలకమని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చినట్లుగా సమాచారం.

సుప్రీంకోర్టు రియాక్షన్ ఇదే..

స్టీఫెన్‌సన్ దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన ధర్మాసనం (CJI Bench) పరిగణనలోకి తీసుకుంది. పిటిషన్‌లోని అంశాలను పరిశీలించిన సీజేఐ ధర్మాసనం.. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను వాయిదా వేసింది. కాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత జరిగిన శాసనమండలి (MLC) ఎన్నికల సమయంలో ఈ 'ఓటుకు నోటు' ఉదంతం వెలుగులోకి వచ్చింది. నామినేటెడ్ ఎమ్మెల్యేగా ఉన్న స్టీఫెన్‌సన్‌ను తమ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయాలని కోరుతూ.. రేవంత్ రెడ్డి భారీగా నగదు ఆశ చూపారనే ఆరోపణలతో పాటు లావాదేవీలకు సంబంధించి వీడియోలు కూడా బయటకు వచ్చాయి. ఈ కేసుకు సంబంధించి గతంలో ఏసీబీ విచారణ, హైకోర్టులో వివిధ పిటిషన్లు దాఖలు కావడం, రాజకీయంగా తీవ్ర దుమారం రేగడం తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసు సుప్రీంకోర్టు విచారణలో ఉండగా, తాజాగా స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

సీఈసీ జ్ఞానేశ్‌కు వ్యతిరేకంగా పిల్స్.. ఈసీ, కేంద్రానికి సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ: చీఫ్ ఎలక్షన్ కమీషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై దాఖలైన అభ్యర్థనలపై ఇవాళ సుప్రీంకోర్టువిచారణ చేపట్టింది. ఆ పిల్స్ అంశంలో కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎన్నికల కమీషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీల అనుమతి లేకుండానే అక్టోబర్ 2025 నుంచి ఆగస్టు 2026 మధ్య కాలంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ 14 నిర్ణయాలను తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ ఆరోపణలపై సుప్రీంలో పిల్ దాఖలు చేశారు.చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వీ మోహనతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. పిల్స్‌పై వివరణ ఇవ్వాలని కోరుతూ జ్ఞానేశ్, సంధూ, జోషి, ఈడీ డైరెక్టర్ జనరల్ సీమాఖన్నా, సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమీషనర్ మానేశ్ గార్గ్‌లను కోరింది. సంధూ, జోషి అనుమతి లేకుండానే సీఈసీ జ్ఞానేశ్ నిర్ణయాలు తీసుకున్నారని, మార్గదర్శకాలను మార్చేశారని, సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారని రాకేశ్ కుమార్ సింగ్, శైలేంద్ర మణి త్రిపాఠిలు తమ పిల్స్‌లో ఆరోపించారు.సీఈసీ విధులను అడ్డుకోవాలంటూ సీనియర్ న్యాయవాది వికాశ్ సింగ్ చేసిన అభ్యర్థనను సుప్రీం తిరస్కరించింది. కేవలం వార్తా కథనాల ఆధారంగా ఎన్నికల సంఘం వివరణ లేకుండా ఎటువంటి ఆదేశాలను ఇవ్వబోమని సుప్రీం పేర్కొన్నది.

సిరిసిల్ల పూర్తయింది... ఇక సిద్ధిపేట...



మెదక్, అక్టోబరు 5,ఉమ్మడి కరీంనగర్, మెదక్ జిల్లాల్లో గులాబీ పార్టీ బలమైన అడ్డాగా ఉన్న నియోజకవర్గాలపై వ్యూహాత్మకంగా దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సిరిసిల్ల సభ తర్వాత తన తదుపరి పొలిటికల్ టార్గెట్‌గా సిద్ధిపేటను ఎంచుకోవడం తెలంగాణ రాజకీయంలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లపై నిధుల వర్షం కురిపిస్తూనే రాజకీయ విమర్శలతో దాడి చేసిన సీఎం రేవంత్, ఇప్పుడు బిఆర్ఎస్ ట్రబుల్ షూటర్ హరీష్ రావు స్వక్షేత్రమైన సిద్ధిపేటలో భారీ బహిరంగ సభకు సిద్ధమవుతున్నారు. అయితే, సిరిసిల్ల రాజకీయ సమీకరణలతో పోలిస్తే సిద్ధిపేట గడ్డపై బిఆర్ఎస్‌ను ఢీకొట్టడం కాంగ్రెస్‌కు అంత సులువైన విషయం కాదన్నది ప్రాథమిక అంచనా.సిద్ధిపేట నియోజకవర్గం దశాబ్దాలుగా గులాబీ జెండాకు తిరుగులేని బలమైన కోటగా ఉంది. 1985లో తొలిసారిగా కేసీఆర్ ఇక్కడి నుంచి గెలిచిన నాటి నుంచి నేటి వరకు ఈ నియోజకవర్గం కేసీఆర్ కుటుంబం చేతుల్లోనే ఉంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా రాష్ట్ర స్థాయి రాజకీయాలకు పరిమితమైన తర్వాత, సిద్ధిపేట బాధ్యతలను స్వీకరించిన హరీష్ రావు నియోజకవర్గాన్ని కేవలం ఒక రాజకీయ స్థానంగా కాకుండా తన సొంత ఇల్లుగా మార్చుకున్నారు. వరుసగా ఆరుసార్లు రికార్డు స్థాయి భారీ మెజార్టీలతో విజయం సాధించడమే కాకుండా, ప్రత్యర్థి పార్టీల ఉనికిని కూడా ప్రశ్నార్థకం చేసే స్థాయికి నియోజకవర్గంలో పట్టు సాధించారు.హరీష్ రావు రాజకీయ విజయంలో ప్రధాన బలం ఆయన పెంపొందించుకున్న వ్యక్తిగత అనుబంధం, నిరంతర అందుబాటు . సిద్ధిపేటలోని ప్రతి గ్రామంలోనూ, ప్రతి వార్డులోనూ హరీష్ రావుకు సొంత కేడర్ ఉంది. ప్రతీ శుభకార్యానికి లేదా అశుభకార్యానికి పలకరించే స్థాయి కార్యకర్తల నెట్‌వర్క్, నియోజకవర్గంలోని ప్రతి కుటుంబంతో ఏదో ఒక రూపంలో నేరుగా కనెక్టివిటీ ఉండటం ఆయనకు శ్రీరామరక్షగా మారింది. దానికి తోడు మంత్రిగా పనిచేసిన సమయంలో రంగనాయక సాగర్ జలాశయం, వైద్య కళాశాల, ఐటీ పార్కు మోడల్ బస్టాండ్ వంటి ప్రాజెక్టులతో సిద్ధిపేటను అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దడం ఆయన బలాన్ని మరింత ద్విగుణీకృతం చేసింది. సిద్ధిపేటలో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా అత్యంత బలహీనమైన స్థితిలోనే ఉందనేది వాస్తవం. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి స్థానిక స్థాయిలో గులాబీ పార్టీ పట్టును తట్టుకోగల బలమైన, జనాకర్షణ కలిగిన నాయకత్వం కరువైంది. సిరిసిల్లలో చేరికలు లేదా అంతర్గత విభేదాలను ఆసరాగా చేసుకుని విమర్శలు గుప్పించే వెసులుబాటు కాంగ్రెస్‌కు ఉన్నప్పటికీ, సిద్ధిపేటలో హరీష్ రావు కేడర్‌ను లేదా ఓటు బ్యాంకును చీల్చడం కాంగ్రెస్‌కు పెద్ద సవాలు. దీంతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ ఎంత భారీ స్థాయిలో నిర్వహించినప్పటికీ, అది స్థానిక రాజకీయ సమీకరణలను ఎంతవరకు ప్రభావితం చేస్తుందనేది ప్రశ్నార్థకమే సీఎం రేవంత్ రెడ్డి వ్యూహం కేవలం ఎన్నికల విజయం కోసమే కాకుండా, బిఆర్ఎస్ ప్రధాన నాయకత్వంలో మానసిక అభద్రతాభావాన్ని పెంచడమే లక్ష్యంగా కనిపిస్తోంది. హరీష్ రావు అసెంబ్లీలో ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్న తరుణంలో, ఆయన సొంత నియోజకవర్గంలోనే బహిరంగ సభ పెట్టి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు రాజకీయంగా సవాల్ విసరడం ద్వారా రేవంత్ రెడ్డి డిఫెన్సివ్ రాజకీయాల కంటే ఎదురుదాడి రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని స్పష్టమవుతోంది. ముఖ్యంగా కాంగ్రెస్ కేడర్‌లో ధైర్యం నూరిపోసి, భవిష్యత్తు స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీకి ఊపిరి పోయడం కూడా ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. సిరిసిల్ల తరహాలో సిద్ధిపేటను ఒకే దెబ్బతో డిఫెన్స్‌లో పడేయడం రేవంత్ రెడ్డికి ఏమాత్రం సులభం కాదు. హరీష్ రావు నిర్మించుకున్న వ్యక్తిగత సంబంధాలు, అభివృద్ధి మార్కు, తిరుగులేని సంస్థాగత నిర్మాణం ముందు కాంగ్రెస్ కమ్యూనికేషన్ వ్యూహాలు ఎంతవరకు పారుతాయనేది వేచి చూడాలి. సభ ద్వారా కాంగ్రెస్ కొంత సంచలనం సృష్టించినప్పటికీ, సిద్ధిపేట 'కోట'ను బద్దలు కొట్టాలంటే కేవలం బహిరంగ సభలు మాత్రమే సరిపోవని, సుదీర్ఘమైన క్షేత్రస్థాయి వ్యూహం అవసరమని భావిస్తున్నారు.

తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం



హైదరాబాద్, అక్టోబరు 5: తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. డిసెంబర్ 2027 నాటికి 67 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం, ఫ్యూచర్ సిటీలో విద్యాసంస్థల ఏర్పాటుపై సీఎస్ సంజయ్ జాజు ఈరోజు (సోమవారం) సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. జూన్ 2028 నాటికి 87 స్కూళ్ల ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు.

దశలవారీగా యంగ్ ఇండియా స్కూళ్లు ఏర్పాటు..

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో దశలవారీగా యంగ్ ఇండియా స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఒక్కో స్కూల్‌కు సుమారు 26 ఎకరాల్లో ఆధునిక మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఒకే క్యాంపస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫ్యూచర్ సిటీలో విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లకు ప్రత్యేక విధానం తీసుకువస్తామని చెప్పారు.ఇందుకోసం లండన్, బర్మింగ్‌హామ్ యూనివర్సిటీలతో పాటు మరో 4 విదేశీ వర్సిటీలు ఆసక్తి చూపిస్తున్నాయని సీఎస్ వివరించారు. విదేశీ వర్సిటీలకు మౌలిక వసతులు, పెట్టుబడులు, అనుమతులపై సమగ్ర విధానం ప్రవేశపెడతామని అన్నారు. గ్లోబల్ సమ్మిట్ నాటికి స్పష్టమైన కార్యాచరణ, ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

సన్న బియ్యం ధరలపై హరీశ్ ఫైర్.. నాలుగు నెలల్లో 25 శాతం పెరిగాయంటూ విమర్శలు

హైదరాబాద్, అక్టోబర్ 5: రాష్ట్రంలో నిత్యావసర ధరల నియంత్రణపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందంటూ మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ధరల పెరుగుదలతో సామాన్యుడిపై పెను భారం పడుతోందన్నారు. వెంటనే ధరల పెరుగుదలపై సమీక్ష నిర్వాహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి సాధించామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందన్నారు. ఉత్పత్తి పెరిగితే బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్నంటుతున్నాయని మాజీ మంత్రి ప్రశ్నించారు.

హరీశ్ రావు పోస్ట్..

'సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి .. రేవంత్ సర్కార్ నేల చూపులు చేస్తోంది. నిత్యవసర ధరల నియంత్రణపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసింది. సామాన్యుడిపై పెనుభారం పడుతుంటే పౌరసరఫరాల శాఖ మొద్దు నిద్రలో ఉంది. వెంటనే ధరల పెరుగుదలపై సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలి. నిత్యావసరాల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తుంటే.. ధరలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దారుణం. ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యవేక్షణ వైఫల్యానికి సామాన్య ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారు. సన్నబియ్యం ధరలు కేవలం నాలుగు నెలల్లోనే 25 శాతం పెరగడం ప్రభుత్వానికి కనిపించడం లేదా? రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి సాధించామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం... మరి ఉత్పత్తి పెరిగినప్పుడు ధరలు తగ్గాల్సింది పోయి.. బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్ని అంటుతున్నాయి?' అని ప్రశ్నించారు.'మీరు ఇస్తున్న సన్నబియ్యం పథకం సఫలం అయితే, ఎందుకు బియ్యం ధరలు అదుపు తప్పుతున్నాయి? మీరు ఇస్తున్న నాణ్యత లేని సన్నబియ్యాన్ని ప్రజలు వినియోగించడం లేదని చెప్పడానికి ఇది



సంపాదకీయం

మంగళవారం 06-10-2026

సందిగ్ధ సంబంధాల్లో స్వల్పకాలిక సయోధ్య

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తాజాగా అమెరికాలో పర్యటించి ట్రంప్‌తో సమావేశమయ్యారు. నవంబరు 10 నుంచి జనవరి 10 వరకు వాణిజ్య యుద్ధానికి విరామం ఇవ్వాలనీ, ఏఐ రంగంలో అనూహ్య పరిణామాలు సంభవిస్తే, వాటి పరిష్కారానికి వెంటనే హాట్‌లైన్‌లో సంప్రదించుకోవాలని అధినేతలిద్దరూ అంగీకరించారు. ఇంతకుమించి గొప్పగా చెప్పుకోవాల్సింది ఏమీ లేకపోవడంతో, ఈ భేటీ విజయవంతం కానట్లేనని కొందరు వ్యాఖ్యానించారు. కానీ, ఈ పర్యటనలో పైకి కనిపించని అంశాలు చాలానే ఉన్నాయి.జిన్‌పింగ్ అమెరికా పర్యటన ముగింపులో రెండు దేశాలు ఎలాంటి సంయుక్త ప్రకటనను విడుదల చేయలేదు. ట్రంప్–షీలు కలిసి విలేకరుల సమావేశాన్నీ నిర్వహించలేదు. ఉభయ దేశాల మధ్య భారీ ఒప్పందాలేవీ కుదరలేదు. కానీ జిన్‌పింగ్ పర్యటన తాత్కాలికంగా ఉద్రిక్తతల సడలింపునకు దారితీసింది. ఆసియా, ఇతర చోట్ల అమెరికా ఆధిపత్యాన్ని తొలగించి, ఆ స్థానాన్ని భర్తీ చేయాలని చైనా దశాబ్దకాలంగా చర్యలు తీసుకుంటోంది. చైనాను అమెరికా సవాలుగా పరిగణించి, ఆసియా ప్రాంతంలో డ్రాగన్‌కు వ్యతిరేకంగా కూటములను నిర్మించింది. దీనివల్ల రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతూ వచ్చాయి. ఏదిఏమైనా ప్రపంచశక్తిగా ఉన్న అమెరికా ఆధిపత్యం చైనా చేతికి చిక్కడమనేది అంత తేలికేమీ కాదు.

సుంకాల ఉపసంహరణ...

చైనా అధ్యక్షుడి అమెరికా పర్యటనపై రెండు దేశాలు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశాయి. 'పరస్పర గౌరవం, ఇచ్చిపుచ్చుకునే ధోరణి, ఉమ్మడి ప్రయోజనాలు, వ్యూహాత్మక స్థిరత్వం ఆధారంగా చైనా–అమెరికా సంబంధాలు నిర్మాణాత్మకంగా ముందుకుసాగాలి' అని చైనా ప్రకటన నొక్కిచెప్పింది. ఈ ప్రకటనలో 'వ్యూహాత్మక స్థిరత్వం' అనే పదాన్ని రెండుసార్లు ప్రస్తావించారు కానీ, అమెరికా ప్రకటనలో ఇదేమీ కనిపించలేదు. చైనా నుంచి అమెరికాకు జరుగుతున్న అక్రమ ఫెంటానిల్ డ్రగ్ ఎగుమతుల ప్రస్తావనతో వాషింగ్టన్ ప్రకటన ప్రారంభమైంది. ఈ మాదక ద్రవ్య సేవనం వల్ల అక్కడ ఏటా లక్షమంది బలవుతున్నారు. 'అమెరికాకు అరుదైన లోహాల సరఫరాను చైనా కొనసాగించాలి. స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్‌ను కాపాడాలి. అమెరికా, రష్యా, చైనాల మధ్య త్రైపాక్షిక ఆయుధ చర్చలు కొనసాగాలి' అని అగ్రరాజ్య ప్రకటన పేర్కొంది. అయితే– ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయకుండా నిరోధించాలనీ, హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచాలనీ, 3వేల కోట్ల డాలర్ల మేర పరస్పరం సుంకాలను ఉపసంహరించుకోవాలనే అంశాలపై రెండు దేశాలు తమ ప్రకటనల్లో ఏకీభవించాయి. ఏఐ, మాదకద్రవ్య నిరోధం వంటి అంశాలపైనా ఉమ్మడి వైఖరిని చాటాయి.చిత్రమేమంటే, ఉభయ దేశాలు తాము రెండో ప్రపంచ యుద్ధంలో మిత్రదేశాలమనీ, యుద్ధంలో గెలవడానికి భుజంభుజం కలిపి పోరాడామనీ చెప్పుకోవడం! వాస్తవానికి, కమ్యూనిస్టుల నాయకత్వంలోని ప్రస్తుత పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా, రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత– అక్టోబరు 1949లో ఏర్పడింది. గత దశాబ్ద కాలంలో చైనా, అమెరికాల మధ్య ఆర్థిక, వాణిజ్య, పెట్టుబడి సంబంధాలు వివాదాస్పదంగా మారాయి. నిజానికి చైనాకు 'వాణిజ్యపరంగా అత్యంత అభిమానపాత్ర దేశం' అనే హోదాను పొడిగించడం ద్వారా, ప్రపంచ వాణిజ్య సంస్థలో చేర్చడం ద్వారా డ్రాగన్ ఎదుగుదలకు అమెరికా సాయం చేసింది. ప్రతిగా వాషింగ్టన్‌కు బీజింగ్ ఒరగబెట్టిందేమీ లేదు. చైనాతో అమెరికాకు 8.9లక్షల కోట్ల డాలర్ల వాణిజ్యలోటు ఏర్పడింది. ట్రంప్ మొదటిసారి అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చైనాపై సుంకాలు విధించడానికి ఇదే కారణం. తర్వాత బైడెన్ హయాంలో, ట్రంప్ రెండో పదవీకాలంలో కూడా సుంకాలు కొనసాగాయి. కానీ, తాజాగా ప్రకటితమైన 3వేల కోట్ల డాలర్ల పరస్పర సుంకాల తగ్గింపు– ఈ పన్నుల విధానం విఫలమైందని నిరూపిస్తోంది.రెండు దేశాల మధ్య మరో ప్రధాన సమస్య– తైవాన్‌కు సంబంధించినది. 1979లో అమెరికా పార్లమెంట్ తైవాన్ సంబంధాల చట్టాన్ని ఆమోదించినప్పటి నుంచి వాషింగ్టన్ ఆ దేశానికి మద్దతు ఇస్తోంది. మరోవైపు, తైవాన్‌కు ఇష్టం లేకపోయినాసరే, ఆ దేశం తనలో విలీనం కావాల్సిందేనని చైనా పట్టుబడుతోంది. గత నాలుగేళ్లలో చైనా సైన్యం తైవాన్ జలసంధిలోని సరిహద్దు రేఖను దాటి దాదాపు 13వేల సార్లు బెదిరింపు విన్యాసాలు నిర్వహించింది. దీన్ని ఎదుర్కోవడానికి తైవాన్ అమెరికా నుంచి 1400 కోట్ల డాలర్ల ఆయుధ బదిలీని కోరింది. కానీ, చైనా ఒత్తిడి వల్ల అమెరికా దీనిపై నిర్ణయం తీసుకోలేదు. ఆయుధ బదిలీని ఆమోదిస్తే, జిన్‌పింగ్ అమెరికా పర్యటనను రద్దు చేసుకుంటారని చైనా సందేశం పంపింది. అమెరికా నాయకత్వంలో ఏర్పాటైన కూటములు కూలిపోవాలని చైనా కోరుకుంటోంది. ఒకినావాలో అమెరికా సైన్యాన్ని నిలపడానికి జపాన్ ఏటా 140కోట్ల డాలర్లను వాషింగ్టన్‌కు చెల్లిస్తోంది. దక్షిణ కొరియా దాదాపు 89కోట్ల డాలర్లు ముట్టజెబుతోంది. కూటములను తెంచుకుంటే అమెరికా ఈ నిధులను కోల్పోతుంది. మరి ఆ నష్టాన్ని చైనా భర్తీ చేస్తుందా?

భారత్‌పై ప్రభావమెంత?

జిన్‌పింగ్ అంతకుముందు, తాజా భేటీలోనూ ట్రంప్‌తో జరిపిన చర్చల్లో ఉభయ దేశాల సంబంధాలను చక్కదిద్దుకోవడానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు. 2009లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా చైనాతో కలిసి 'గ్రూప్–2' ఏర్పాటును ప్రతిపాదించారు. రెండు దేశాలు కలిసి ప్రపంచాన్ని ఏలాలన్నది దాని సారాంశం. నిరుడు అక్టోబరులో జిన్‌పింగ్‌ను కలిసిన తర్వాత ట్రంప్ కూడా 'జీ–2' గురించి ప్రస్తావించారు. ఇది సాకారమైతే, చైనా ఆసియాలో చెలరేగిపోతుంది, భారత్ విషయంలోనూ తీవ్ర పరిణామాలకు దారితీయవచ్చు. రెండు దశాబ్దాలుగా వాషింగ్టన్‌తో సంబంధాలను బలోపేతం చేసుకుంటున్న న్యూదిల్లీ ఇక తన దారి తాను చూసుకోవాల్సి వస్తుంది. అమెరికా–చైనాల వ్యాపార వాతావరణం మెరుగుపడితే... చైనా నుంచి ఆగ్నేయాసియాకూ భారతదేశానికీ పెట్టుబడులను, కర్మాగారాలను తరలించాలనే అంతర్జాతీయ కంపెనీల వ్యూహం వెనకడుగు వేస్తుంది. తాజా భేటీలో 'ఇండో–పసిఫిక్ స్వేచ్ఛా మండలంగా ఉండాలి' అని అమెరికా ప్రస్తావించినప్పటికీ, చైనా ఒత్తిడితో ఈ ఆలోచన కూడా వెనకడుగు వేయవచ్చు.

ఫ్లైట్‌లో దాడి ముందస్తు పథకమా ?



న్యూఢిల్లీ,ఇటీవల ఫ్లైదుబాయ్ విమానంలో భారతీయ పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్పై దాడి జరగడం కలకలం రేపింది. అది కూడా కో పైలట్ ఈ పని చేయడం ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది.మచ్చర్పై దాడికి యత్నించిన కో–పైలట్ హమామ్ అల్–హమామీకి సంబంధించి పలు కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. పలు నివేదికల ప్రకారం, అతడి పాత సోషల్ మీడియా అకౌంట్లు పరిశీలనలో అల్–ఖైదాతో సంబంధం ఉన్న వ్యక్తుల ఫోటోలు, ఇతర అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన సమాచారం లభించాయి. యూఏఈ అటార్నీ జనరల్ ఈ ఘటనపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఉగ్రదాడి, హైజాక్ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.నివేదికల ప్రకారం, హమామ్ అల్–హమామీ ఒమన్‌కు చెందిన పౌరుడు. అతడు యూఏఈలో జన్మించాడని కొన్ని నివేదికలు చెబుతుండగా.. అతని తండ్రి ఒమన్ పౌరుడని, తల్లి సిరియాకు చెందిన వ్యక్తి అని తెలిసింది. అతడు కొన్నేళ్లపాటు యూఏఈలో గడిపాడు. అతని పేరుతో ఉన్న లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ ప్రకారం, ఒమన్ ఎయిర్లో దాదాపు ఏడేళ్లు పనిచేశాడు. ఆ తర్వాత రాయల్ ఎయిర్ మరోక్)తో అనుబంధం కలిగి ఉన్నాడు. ఆ తర్వాత ఫ్లైదుబాయ్లో కో–పైలట్గా చేరి సేవలు అందిస్తున్నాడు.

ఒమన్ ఎయిర్లోనూ ప్రయాణికుల భద్రతపై ఆందోళన

సీఎన్ఎన్ కథనం ప్రకారం, 2024లో నిందితుడు, కో పైలట్ హమామ్ అల్ హమామీని ఒమన్ ఎయిర్లో ఫ్లైట్ ట్రైనింగ్ నుంచి తప్పించారు. తీవ్రవాద భావజాలం వల్ల ఆకర్షితుడు అవుతున్నాడని అతడిపై అనుమానం వచ్చింది. దాంతో తలెత్తిన భద్రతా పరమైన ఆందోళనలే అతడ్ని తొలగించడానికి కారణమని సమాచారం. అతడిని ఎయిర్లైన్ నుంచి పూర్తిగా తొలగించకుండా ఇతర, నాన్–ఫ్లయింగ్ బాధ్యతలు అప్పగించారని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. అయితే, ఆ సమయంలో అతని సమాచారాన్ని ఇతర ఎయిర్లైన్లు లేదా సంబంధిత దేశాల సంస్థలతో ఎంతవరకు పంచుకున్నారనే అంశంపై స్పష్టత లేదు.

సోషల్ మీడియాలో ఏం వివరాలు కనిపించాయి

సీఎన్ఎన్ నివేదిక ప్రకారం, హమామ్కు సంబంధించిన సోషల్ అకౌంట్లలో కొన్ని అనుమానాస్పద ఫోటోలు, వీడియోలు లభించాయి. అందులో అల్–ఖైదాతో సంబంధం ఉన్న వ్యక్తులు కనిపిస్తున్నారు. ఒక వీడియోలో బోయింగ్ 737 మాక్స్ కాక్పిట్ నుంచి వేర్వేరు విమానాల రికార్డింగ్ కనిపిస్తుంది. వీడియో చివరలో అల్–ఖైదా మాజీ చీఫ్ ఐమన్ అల్–జవాహిరీ, 2009లో CIA అధికారుల హత్యతో సంబంధం ఉన్న హుమామ్ ఖలీల్ అబూ–ములాల్ అల్–బలావీల ఫోటోలు ఉన్నాయని గుర్తించారు. ఈ పోస్టులపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఆ తర్వాత సోషల్ మీడియా ప్రొఫైల్లు తొలగించారు.

మక్కా, మదీనా, జెరూసలేంలకు చెందిన ఏఐ ఫొటో పోస్ట్

నివేదికల ప్రకారం, మరొక సోషల్ పోస్ట్లో ఏఐ సాయంతో తయారు చేసిన ఒక ఫోటో ఉంది. అందులో మక్కా, మదీనా, జెరూసలేంలను ఒక మెరుస్తున్న గీతతో కలిపాడు. దీంతో పాటు మరణం, అవమానానికి సంబంధించిన పదాలతో ఉన్న ఒక కవిత ఉన్నాయి. ఈ పోస్టులకు ప్రమాదంతో నేరుగా సంబంధం ఉందో లేదో దర్యాప్తులో తేలనుంది.

మహిళలపై పాత పోస్టులు

సీఎన్ఎన్ నిపుణుల ప్రకారం, హమామ్ పాత, ఇప్పుడు తొలగించిన సోషల్ మీడియా పోస్టులలో మహిళల పట్ల కఠినమైన అభిప్రాయాలు ఉన్నాయి. పెళ్లి తర్వాత భార్య ఉద్యోగం చేయకూడదని, నిఖాబ్ ధరించాలని భావిస్తున్నట్లు పేర్కొన్నాడు. మరికొన్ని పోస్టులలో పురుషులు, మహిళలు కలసి పనిచేసే వర్క్ స్పేస్ లను పూర్తిగా వ్యతిరేకించాడు. సీఎన్ఎన్ 2021, 2022 నాటి దాదాపు 3,000 తొలగించిన పోస్టులను విశ్లేషించారు. ఈ పోస్టుల ద్వారా అతని వ్యక్తిగత, మతపరమైన ఆలోచనలు ఉన్నాయి. అయితే ఒక వ్యక్తి సోషల్ మీడియా ఆలోచనలకు, ఒక నేర సంఘటనకు నేరుగా లింక్ ఉందా లేదా అనే కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతోంది.

ఫ్లైదుబాయ్ విమానంలో ఏం జరిగింది?

30 సెప్టెంబర్ 2026న ఫ్లైదుబాయ్ విమానం ఖ్లీ1073 దుబాయ్ నుంచి టెల్ అవీవ్కు వెళ్తుండగా కాక్పిట్లో ఇద్దరు పైలట్ల మధ్య గొడవ జరిగింది. కో పైలట్ హమామ్ అల్ హమామీ దాడిలో భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ గాయపడ్డారు. యూఏఈ అధికారిక సమాచారం ప్రకారం, ఈ ఘటన తర్వాత విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్ ఎయిర్ పోర్ట్ వైపు మళ్లించి అక్కడ ల్యాండ్ చేశారు. ప్రయాణికులు, విమానంలో ఉన్న ఇతర క్రూ సభ్యులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. యూఏఈ జనరల్ సివిల్ ఏవియేషన్ అథారిటీ తరువాత కెప్టెన్ స్మిత్ మచ్చర్ సురక్షితంగా యూఏఈకి తిరిగి రాగా, వైద్య చికిత్స కొనసాగుతోంది.

ఆంక్షలు కాదు.. రక్షణ అవసరం



న్యూఢిల్లీ,'చీకటి పడిన తర్వాత బయటకు వెళ్లకండి. నిర్మానుష్య ప్రదేశాల్లో సంచరించకండి. అపరిచితులను కలుసుకోకండి. ఒంటరిగా ప్రయాణించకండి. మీకు నచ్చినట్లు దుస్తులు ధరించకండి. మీ సొంత కళాశాలను విమర్శించకండి. ఆన్‌లైన్ తరగతులకు మారండి. కానీ ఆన్‌లైన్‌లో మీ హక్కులకోసం మాట్లాడడాన్ని ఆపేయండి. మీ భద్రతను కాపాడుకోవడంలో మీరే కొంతవరకు బాధ్యత వహించాలి.' ఇవి మహిళల సాధారణ జీవితంలో ఎదురవుతున్న ఆంక్షలు. ఇన్ని ఆంక్షలు, సూచనలు మహిళలు ఎందుకు పాటించాలి? ఆమె స్వేచ్ఛను పరిమితం చేయడమేనా అసలు రక్షణా? అన్న ప్రశ్నలు ఇప్పుడు సమాజంలో ఎదురవుతున్నాయి. తమ స్వేచ్ఛను నిలదీయడం ఆపివేసి, తమకు రక్షణ కల్పించేలా పరిస్థితులు సరిదిద్దాలని మహిళలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో లైంగిక దాడులు వరుసగా జరగడంతో సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.2012 లో నిర్భయ సంఘటన తర్వాత కూడా ఇలాంటి అభద్రతా పరిస్థితి మహిళలపట్ల ఎందుకు కొనసాగుతోందని ప్రశ్నించింది. స్వరూప్‌నగర్‌లో బాలికపై లైంగిక దాడి, హత్య, గ్రేటర్ నోయిడా నుంచి ఢిల్లీకి వస్తున్న బస్సులో బాలికపై లైంగిక దాడి, తదితర సంఘటనలు వరుసగా జరుగుతుండడం ఢిల్లీ ప్రభుత్వాన్ని కుదిపేస్తున్నాయి. 2012 నుంచి మహిళల భద్రత విషయంలో పెద్దగా మార్పు ఏమీ జరగలేదనే నిరసన ఢిల్లీ, పంజాబ్ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు పదేపదే వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మాత్రం కొత్త చట్టాలు, విధులు, సిసిటివి కెమెరాలు వంటి చర్యలను చూపిస్తూ మహిళల రక్షణ విషయంలో ఎన్నో చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నాయి. విశ్వవిద్యాలయాల యాజమాన్యాలు కూడా ఇదే పాట పాడుతున్నాయి. ఇక్కడ రెండు వర్గాల అనుభవాలు, అవగాహనల మధ్య భారీ అంతరం కనిపిస్తోంది.ఒకవైపు ప్రభుత్వం, సంస్థలు తాము చర్యలు తీసుకుంటున్నామని సర్ది చెబుతుండగా, మరోవైపు యువతులు తమ రోజువారీ అనుభవాల్లో తమకు భద్రత ఏమాత్రం కలగడం లేదని ధ్వజమెత్తుతున్నారు. 2011 12 లో ఉన్నత విద్యలో మహిళల స్థూల నమోదు నిష్పత్తి' (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) 19% కాగా, పురుషులది 22 శాతంగా ఉంది, 201718 నాటికి మహిళల స్థూల నమోదు నిష్పత్తి పురుషుల కంటే ఎక్కువగా నమోదైంది. ఆ అధిక్యం కొనసాగుతోంది. విద్య, వృత్తి, స్వేచ్ఛ లక్షాల విషయంలో యువతులు చారిత్రకంగా ముందడుగేస్తున్నారు. కానీ వారిని రక్షించాల్సిన సంస్థలు మాత్రం పాతకాలపు ఆలోచనల్లోనే ఉంటున్నాయి. చీకటి పడిన తర్వాత యువతులు బయటకు వెళ్లాలంటే ఎన్నో ఆంక్షలు.మునుపటి తరాలు విద్య, ఉద్యోగాల కోసం ఇలాంటి పరిస్థితులను భరించి ఉండవచ్చు. కానీ అందుకే నేటి విద్యార్థులు కూడా పురుషుల హింసకు పరిష్కారం మహిళల ప్రవర్తనను నియంత్రించడమే అన్న సూచనలను అంగీకరించాల్సిన అవసరం లేదు. దానికి బదులుగా వారు కోరుతున్నది వ్యవస్థలో మార్పు అంటే వీధుల్లో సరైన వెలుతురును ఏర్పాటు చేయడం, సురక్షితమైన రవాణా కల్పించడం, పోలీసింగ్‌ను మెరుగుపర్చడం వంటి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రాత్రి వేళ స్వేచ్ఛగా సంచరించే భద్రతను తిరిగి సాధించుకోవడానికి యువతులు ర్యాలీలు నిర్వహించినప్పుడు, వారి చుట్టూ భారీ సంఖ్యలో పోలీస్ బలగాలు మోహరించి ఉంటాయి. కానీ నిజంగా అత్యవసరంగా మహిళలకు అవసరమైన సమయంలో మాత్రం ఒక్క పోలీస్ కూడా కనిపించకపోవడం వింత.నేరస్థులకు చట్టం పట్ల భయం కలిగించడం ద్వారా మహిళలకు రక్షణ కల్పించవచ్చనే విషయాన్ని పక్కన పెట్టండి. అనేక అధ్యయనాలు ఈ పరిస్థితులన్నీ మన దేశంలో మహిళల జీవన నాణ్యతను పరిమితం చేశాయని నిరూపించాయి. చెన్నైలో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం మధ్యాహ్నం 35 గంటల మధ్య ఎక్కువ మంది మహిళలు ప్రయాణిస్తుండగా, పురుషులు ఎక్కువగా సాయంత్రం 57 గంటల మధ్య ప్రయాణిస్తున్నారు. ముంబైపై జరిగిన మరో అధ్యయనంలో సురక్షితంగా భావించే ఈ నగరంలో కేవలం 31% వీధుల్లోనే తగినంత వెలుతురు ఉంటోంది. ఢిల్లీలో ఒక అధ్యయనం ప్రకారం సురక్షితంగా ప్రయాణించేందుకు మహిళలు తమకు తక్కువ ర్యాంక్ ఉన్న కళాశాలలను కూడా ఎంచుకుంటున్నారు.'పింక్ ట్యాక్స్' (మహిళల కోసం ఉత్పత్తులు/ సేవలకు అదనంగా వసూలు చేసే ధర) కూడా చాలా విస్తృతంగా ఉంది. మహిళలు దీనికి వ్యతిరేకంగా ఆందోళన లేవదీశారంటే, అది ఎప్పటికైనా జరుగుతుందని ఊహించవచ్చు. భద్రత అనేది కాలేజీ గేటు దగ్గరినే ముగిసిపోకూడదు. ఒక మహిళ రాత్రి 10 గంటలకు తన హాస్టల్ నుంచి బయటకు వెళ్లి, కేఫ్‌కు నడుచుకుంటూ వెళ్లి, స్నేహితులను కలుసుకుని తిరిగి ప్రజా రవాణాలో ఇంటికి వెళ్లగలగాలి, అందుకోసం ఆమె ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఉండకూడదు.తాను ఎందుకు బయటకు వెళ్లిందో లేదా ఎవరితో ఉన్నదో వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఉండకూడదు. అప్పుడే ఆమెకు సంపూర్ణ స్వేచ్ఛ, భద్రత లభించినట్టు. నిర్భయ సంఘటన తరువాత ప్రమాదకర ప్రాంతాలు ఎక్కడ ఉన్నాయో గుర్తించడానికి కమిటీ వేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. చీకటి ప్రాంతాలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవడానికి మరోసారి కమిటీ పరిశీలన ఎందుకు? మహిళలకు భద్రత కొరవడిన విషయమై గతంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించకుండా కొత్త సర్వేలు, కొత్త నివేదికలు, కొత్త హామీలు ఎందుకు? నిర్భయ సంఘటన జరిగి పధ్నాలుగేళ్లయినా అవే ప్రశ్నలు మళ్లీ సుప్రీం కోర్టు ముందుకు రావడం ప్రభుత్వాల పనితీరులో దొల్లతనం బయటపెడుతున్నాయి.

రాబోయే ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే బుద్ధి చెబుతారు

బద్వేలు, నియోజకవర్గంలో రాబోయే 2026 మున్సిపాలిటీ, జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో వైసిపికి ప్రజలు తమ ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతారని టిడిపి సీనియర్ నాయకులు, బద్వేల్ మాజీ మున్సిపాలిటీ అధ్యక్షులు డా,, కొంకుల రాంబాబు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన విధానంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల్లో సానుకూల స్పందన ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రగతి కోసం అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా ప్రభుత్వంలోని అన్ని శాఖలను సమన్వయం చేస్తూ సుపరిపాలనకు సీఎం చంద్రబాబు ప్రభుత్వం పెద్దపీట వేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సుదీర్ఘ రాజకీయ అనుభవం మరియు ముందుచూపుతో రాష్ట్ర పాలనను ప్రజలకు మరింత చేరువుగా తీసుకెళ్తున్నారని అన్నారు.ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు సంక్షేమ కార్యక్రమాలు సకాలంలో అందేలా యంత్రాంగాన్ని ప్రభుత్వం దిశా నిర్దేశం చేస్తుందని ఆయన అన్నారు. నేడు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రగతి కొన్ని దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలే తెలుగుదేశం పార్టీకి (శ్రీరామరక్ష) పూర్తి మద్దతు తీసుకువస్తాయని అన్నారు. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమ మరియు రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పును స్పష్టంగా వెల్లడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కొంకుల రాంబాబు అన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ పాఠశాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ గా సుభాన్ ఏకగ్రీవంగా ఎన్నిక

గోనెగండ్ల ,శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన పాఠఅ ఎన్నికల సమావేశంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ పదవికి సుభాన్ పేరును సభ్యులు ప్రతిపాదించగా, మిగతా సభ్యులందరూ మద్దతు తెలపడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిన్సిపల్ ప్రకటించారు.అనంతరం నూతన ఛైర్మన్ సుభాన్ ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠఅ సభ్యులు ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా సుభాన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు.పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల హాజరు శాతం పెంపు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు.ప్రిన్సిపల్ షాహిన్ పర్వీన్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధిలో పాఠఅ పాత్ర కీలకమని అన్నారు. నూతన ఛైర్మన్ నాయకత్వంలో పాఠశాల మరింత ప్రగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రోత్సాహం అందించేందుకు కమిటీ కృషి చేయాలని సూచించారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలాధారం

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ఆవరణలో ప్రారంభమైన "స్పెషల్ క్యాంపెయిన్ – 6 " స్వచ్ఛ-స్వచ్ఛ భారత్" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.?ఈ సందర్భంగా జీఎం గారు మాట్లాడుతూ, పూజ్య బాపూజీ కలలు కనిన స్వచ్ఛ భారత స్వప్నాన్ని సాకారం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. "గాంధీజీ కేవలం రాజకీయ స్వతంత్ర భారతమే కాకుండా, పరిశుభ్రమైన మరియు అభివృద్ధి చెందిన దేశాన్ని ఆకాంక్షించారు. ఆయన స్ఫూర్తితో 'స్వచ్ఛ తెలంగాణ' లక్ష్యాన్ని సాధిస్తూ, స్వచ్ఛ భారత్ రూపకల్పనలో సింగరేణి కుటుంబాలన్నీ భాగస్వామ్యం కావాలి అని పిలుపునిచ్చారు.పరిసరాల అపరిశుభ్రత వలన వ్యాధులు ప్రబలుతాయని, ఇది మన ఆరోగ్యంతో పాటు సమాజ ఆరోగ్యానికి కూడా హాని కలిగిస్తుందని హెచ్చరించారు. వారానికి కనీసం రెండు గంటలు శ్రమదానం చేసి మన ఇల్లు, పరిసరాలు, మరియు పని చేసే కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలి. మనం పాటించే ఈ పరిశుభ్రత, క్రమశిక్షణ రాబోయే భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి అని పేర్కొన్నారు.కార్యాలయాలు, గనులు మరియు పని ప్రాంతాలలో ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం ఉంటే ఉద్యోగుల పనితీరు, ఉత్పాదకత మెరుగవుతాయని ఆయన తెలిపారు. సింగరేణి అధికారులు, ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులు పరిశుభ్రతను ఒక నిత్యకృత్యంగా మలుచుకుని, స్వచ్ఛమైన వాతావరణంలో "రక్షణతో కూడిన ఉత్పత్తి" కూడా సాధించవచ్చని ఆకాంక్షించారు.అనంతరం అధికారులు, ఉద్యోగులతో స్వచ్ఛ-స్వచ్ఛభారత్ (స్పెషల్ క్యాంపెయిన్-6) ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం, జి.ఎల్. ప్రసాద్, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ, సలేంద్ర సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) సిహెచ్.అశోక్, ఎన్విరాన్మెంట్ అధికారి కాతం వెంకట్ రెడ్డి, సీనియర్ పి ఓ, ఎం.కార్తీక్, ఏఐటియుసి, జి ఎం ,స్ట్రక్చర్ కమిటీ మెంబర్, సి.వి.రమణ,జిఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీ గీతిక మరియు జిఎం ఆఫీస్ ఉన్నత అధికారులు, అధికారులు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను సురక్షితంగా ఉంచేందుకు మనమంతా కలిసి పనిచేద్దాం

పిల్లలు ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాలకు గురికాకుండా వారికి అవసరమైన భద్రత, సంరక్షణ కోసం న్యాయ సేవల ప్రాధికార సంస్థ సూచనలు, కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతునిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. డిజిటల్ వేదికలపై పిల్లల రక్షణ కోసం వ్యవస్థలను బలోపేతం చేయడానికి న్యాయసేవల సంస్థలు చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రతి గ్రామానికి చేరేలా ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని చెప్పారు. జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ (జెంబూం) ఆధ్వర్యంలో "డిజిటల్ వేదికలపై పిల్లలకు రక్షణ, సులభంగా న్యాయం అందించడం : ఆన్‌లైన్ లైంగిక వేధింపులను అరికట్టడం, పిల్లలకు అనుకూలమైన న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం" అన్న ఇతివృత్తంపై దక్షిణాది ప్రాంతీయ సదస్సు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సదస్సులో కేం

భారత్ దెబ్బ... అగ్రరాజ్యం అబ్బ...

న్యూఢిల్లీ,అంతరిక్షంలోనే ఉపగ్రహాలను కూల్చివేసే క్షిపణి టెక్నాలజీ కలిగిన ప్రపంచంలోని నాలుగు దేశాల్లో భారత్ ఒకటి. భారత్ 2019లో అమెరికా, చైనా, రష్యాల సరసన చేరింది. అయితే, మార్చి 2019లో చేపట్టిన ఈ ప్రయోగం అగ్రరాజ్యం అమెరికాను కలవరానికి గురిచేసింది అని ఆ దేశ మాజీ నిఘా అధికారి తాజాగా వెల్లడించారు. ఆయన ఓ పాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. భారత్ చేపట్టిన యాంటి శాటిలైట్ మిసైల్ పరీక్ష సమయంలో ఆందోళన చెందినట్లు తెలిపారు.పోఖ్రాన్-2 అణు పరీక్షలతో అమెరికాతో ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసిన భారత్.. అణుశక్తిలో తాము ఏమాత్రం తీసిపోమని నిరూపించింది. ఇది జరిగిన దాదాపు 28 ఏళ్ల తర్వాత అగ్రరాజ్యానికి భారత్ అలాంటి సర్‌ప్రైజ్ ఇచ్చింది. మార్చి 27, 2019 భారత్ చేపట్టిన 'మిషన్ శక్తి' (యాంటీ శాటిలైట్ క్షిపణి ప్రయోగం అమెరికా నిఘా వర్గాలను తీవ్రగ్రాంతికి గురిచేసింది. దీనికి సంబంధించిన వివరాలను అమెరికా వాయుసేన మాజీ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ డేవిడ్ గ్రుష్ తాజాగా ప్రముఖ పాడ్‌కాస్టర్ జో రోగన్ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అప్పట్లో నేషనల్ రీకాన్సార్చ్ ఆఫీస్ ఆపరేషన్స్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న గ్రుష్.. ఆ సమయంలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు."ఇది ఒక విచిత్రం... 2019లో ఎవరూ ఊహించని విధంగా భారత్ నిర్వహించిన క్షిపణి పరీక్ష వారి ఉపగ్రహాలలో ఒకదానిని తాకింది.. ఈ విషయం గురించి వారు మాకు ముందు తెలియజేయలేదు" అని ఆయన అన్నారు. ఒడిశా తీరంలో భారత్ క్షిపణి పరీక్షకు సంబంధించి నోటీసు జారీ చేసినప్పటికీ.. అది ఉపగ్రహాన్ని పేల్చివేసే 'యాం' క్షిపణి అని అమెరికా ఊహించలేకపోయింది. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగించే వరకు దీనిపై ఎవరికీ అవగాహన లేదు.ఈ ప్రయోగం వల్ల ఏర్పడిన అంతరిక్ష వ్యర్థాల నుంచి తమ నిఘా ఉపగ్రహాలకు ప్రమాదం పొంచి ఉందేమోనని ఎన్ఆర్ఓ అధికారులు తీవ్ర ఆందోళన చెందారని ఆయన అన్నారు. వెంటనే వ్యర్థాల విస్తరణను లెక్కించి, అమెరికా ఉపగ్రహాల మార్గాన్ని మార్చాల్సిన అవసరం ఉందో లేదో చూడాలని విశ్లేషకులను ఆదేశించినట్లు గ్రుష్ తెలిపారు.ప్రయోగంలో భాగంగా భారత్ తన ఉపగ్రహం 'మైక్రోశాట్-ఆర్' ను నింగిలోనే విజయవంతంగా కూల్చివేసింది. దీంతో అంతరిక్షంలోనే ఉపగ్రహాలను ధ్వంసం చేసే వ్యూహాత్మక సామర్థ్యం కలిగిన అమెరికా, రష్యా, చైనాల సరసన భారత్ చేరింది. ఈ ప్రయోగం తక్కువ భూకక్ష్యలో జరిగిందని, ఏర్పడిన వ్యర్థాలు కొన్ని వారాల్లోనే నశిస్తాయని, అంతరిక్షంలో ఆయుధాల పోటీలో పాల్గొనే ఉద్దేశం భారత్‌కు లేదని విదేశాంగ శాఖ అప్పట్లోనే స్పష్టం చేసింది.భారత్ క్షిపణి ప్రయోగంపై నిఘా పెట్టేందుకు డియెగో గార్సియా బేస్ నుంచి అమెరికా వైమానిక దళ విమానం బంగాళాఖాతం మీదుగా వచ్చిందని 'ఎయిర్‌క్రాఫ్ట్ స్పాట్స్' నివేదించింది. అయితే తమ ఆస్తులేవీ భారత్‌పై గూఢచర్యం చేయలేదని అమెరికా రక్షణ శాఖ అప్పట్లో ప్రకటించినప్పటికీ.. గ్రుష్ చెప్పిన విషయాలను బట్టి ఈ ప్రయోగం అమెరికాకు పూర్తిగా ఊహించని షాక్ అని స్పష్టం చేస్తున్నాయి.

హనుమంతుడే కాపాడాడు

హైదరాబాద్,దుబాయ్ విమానంలో జరిగిన హింసాత్మక ఘటనలో వీరోచితంగా పోరాడి, గాయపడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ ను ప్రధాని మోదీ ఫోన్లో పరామర్శించారు. యూఏఈలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మచ్చర్ తో మోదీ వీడియో కాల్ లో మాట్లాడారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాక్ పిట్ లో తనకు ఎదురైన పరిస్థితిని మచ్చర్ ప్రధాని మోదీకి వివరించారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో చూపించిన సమయ స్ఫూర్తి, ధైర్యం అభినందనీయం. మీ ప్రాణం కంటే ప్రయాణికుల భద్రత కోసం పోరాడిన మీరు ఎందరికో స్ఫూర్తిదాయకం. త్వరగా కోలుకోవాలని యావత్ భారత్ ప్రార్థిస్తోంది. భారతీయులు ఇతరుల ప్రాణాలు తీసేవారు కాదు. ఇతరులను రక్షించడం కోసం తమ ప్రాణాలను కూడా ఫణంగా పెట్టడానికి సిద్ధపడతారని మన దేశం ఇప్పుడు గర్వంగా చెప్పుకుంటుంది" అని స్మిత్ తో మోదీ అన్నారు.మరో వైపు ప్రధాని మోదీయే నేరుగా ఫోన్ చేయడంపై కెప్టెన్ స్మిత్ మచ్చర్ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా మచ్చర్ మాట్లాడుతూ "మీరు నాకు అత్యంత ఆరాధనీయులు. మీ నుంచి ఫోన్ రావడం గర్వంగా వుంది. కలలో కూడా నేను ఊహించలేదు. అనుకోని పరిస్థితులు, విపత్కర పరిస్థితుల్లో హనుమాన్ చాలీసా పఠిస్తా. కాక్ పిట్ లో ఘర్షణ సమయంలోనూ హనుమాన్ చాలీసాయే పఠించా. ఆ సమయంలో నేను గాయపడినా, ఆలోచించలేదు. ఎవరి ప్రాణాలూ పోవద్దని మాత్రం దేవుడ్ని ప్రార్థించా. నేను ఎలాగైనా లేవాలి. లేదంటే నాతో పాటు అందరూ మరణిస్తారని గట్టిగా భావించా" అంటూ మోదీకి వివరించారు.

ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలి

సిరిసిల్ల జిల్లా, అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని (ఖీూఓం) టీ అర్ ఎస్ ఎం ఎ. రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు.విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించి, వారు జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. విద్యార్థులతో తల్లిదండ్రులతో పాటు ఎక్కువ సమయం గడిపేది ఉపాధ్యాయులేనని, కాబట్టి వారి ప్రవర్తన, ఆలోచనా విధానం, మనస్తత్వంలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన సమయంలో సరైన మార్గనిర్దేశం చేయాలని , పిల్లలు తమ సమస్యలను తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులతో కూడా పంచుకునే అవకాశం ఉన్నందున పాఠశాలల్లో వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆధునిక సాంకేతిక యుగంలో సామాజిక మాధ్యమాలు సమాచార వినియోగనికి ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ, వాటి అధిక వినియోగం వల్ల విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా, విజ్ఞతతో వినియోగించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు.విద్యార్థులు ఆపదకర పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు వాటిని ఎలా గుర్తించాలి, ఎలా స్పందించాలి, ఎవరిని సంప్రదించాలి అనే అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.జిల్లాలో షీ టీమ్ బృందం ఆధ్వర్యంలో గుడ్ టచ్?బ్యాడ్ టచ్, బాలల రక్షణ, సైబర్ భద్రత తదితర అంశాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, (టీ అర్ ఎస్ ఎం ఎ)రాష్ట్ర నాయకులు శివరాత్రి యాదగిరి, రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, డి.టి.ఓ. శ్రీనివాస్, టీ అర్ ఎస్ ఎంఎం ఎ జిల్లా అధ్యక్షులు నాగుల శ్రీనివాస్ గౌడ్, కరస్పాండెంట్లు, ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తీరని అల్లూరి జిల్లా ఏజెన్సీలో డోలీ మోత కష్టాలు

అల్లూరి,ఏజెన్సీ ప్రాంతంలో స్థానికులకు డోలి మోతలు తప్పడం లేదు. ఒక గర్భిణీ ని సుమారు 7 కిలోమీటర్ల మేర డోలీపై మోసుకుంటూ తరలించాల్సిన దుస్థితి నెలకొంది. రహదారి లేక తడకపల్లి గ్రామం నుంచి నెలలు నిండిన గర్భిణీని గ్రామస్థులు డోలీలో మోసుకెళ్లారు .

ఓయో హోటళ్లలో వరుస ఘటనల కలకలం



హైదరాబాద్, హైదరాబాద్‌లోని హోటళ్లలో వరుసగా చోటుచేసుకుంటున్న మహిళల మరణాలు, హత్యల ఘటనలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 2 వరకు మాదాపూర్, ఎస్ఆర్ నగర్, మియాపూర్ ప్రాంతాల్లో చోటుచేసుకున్న మూడు ఘటనలు హోటళ్లలో అతిథుల భద్రత, గుర్తింపు ధ్రువీకరణ, సీసీ కెమెరాల నిర్వహణ వంటి అంశాలపై మరోసారి చర్చకు దారితీశాయి. అయితే ఈ ఘటనలన్నీ ఒకే సంస్థకు చెందిన హోటళ్లలోనే జరిగాయని చెప్పడం కంటే.. హైదరాబాద్‌లోని హోటళ్లు, లాడ్జీల్లో భద్రతా ప్రమాణాల అమలుపై దృష్టి పెట్టాల్సిన అవసరం కనిపిస్తోందని చెప్పడం సముచితం. ఆయా ఘటనలపై పోలీసులు వేర్వేరుగా దర్యాప్తు చేస్తున్నారు.

మాదాపూర్‌లో నిఖిత మృతి.. నిందితుడి అరెస్టు

సెప్టెంబర్ 21న మాదాపూర్ సిద్ధిఖీనగర్‌లోని ఓ హోటల్‌కు షారోన్ నిఖితా టోప్నో అనే 29 ఏళ్ల మహిళ తన స్నేహితుడు శ్రీనివాస రవితేజతో కలిసి వెళ్లారు. మరుసటి రోజు ఆమె అపస్మారక స్థితిలో కనిపించగా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆమె శరీరంపై గాయాలు కనిపించడంతో పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. దర్యాప్తులో రవితేజను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల ప్రకారం, ఇద్దరి మధ్య వివాదం తలెత్తడంతో దాడి జరిగినట్లు నిందితుడు చెప్పాడు. ఈ కేసులో ఫోరెన్సిక్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్, ఇతర సాంకేతిక ఆధారాలను పోలీసులు పరిశీలించారు.

ఎస్ఆర్ నగర్‌లో బ్యాంకు ఉద్యోగిని మృతి

సెప్టెంబర్ 29న ఎస్ఆర్ నగర్‌లోని ఓయో హోటల్ గదిలో 34 ఏళ్ల బ్యాంకు ఉద్యోగిని బి. శిరీష మృతదేహం లభించింది. ఆమె ఒక వ్యక్తితో కలిసి హోటల్‌లో దిగినట్లు పోలీసులు గుర్తించారు. ఆ వ్యక్తి తెల్లవారుజామున హోటల్ నుంచి వెళ్లిపోయిన తర్వాత సిబ్బందికి అనుమానం వచ్చి గదిని పరిశీలించగా మహిళ మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనలో నకిలీ ఆధార్ కార్డు వినియోగించారనే ఆరోపణలపై కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు దారితీసిన కారణాలు, హోటల్‌లోకి ప్రవేశించే సమయంలో గుర్తింపు పత్రాల పరిశీలన ఎలా జరిగిందనే అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

మియాపూర్‌లో వైద్య విద్యార్థిని మృతి

అక్టోబర్ 2న మియాపూర్‌లోని ఓ హోటల్ గదిలో 27 ఏళ్ల పీజీ వైద్య విద్యార్థిని కోమటి సృజన మృతదేహం లభించింది. హనుమకొండలో పీడియాట్రిక్స్ పీజీ చదువుతున్న ఆమె సెప్టెంబర్ 30న హైదరాబాద్‌కు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఆమెతో కలిసి వచ్చిన వ్యక్తి మరుసటి రోజు హోటల్ నుంచి వెళ్లిపోయిన తర్వాత అతడి ఆచూకీ లభించలేదని పోలీసులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు ఆధారంగా పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. సీసీటీవీ ఫుటేజ్, ఫోన్ లొకేషన్, హోటల్ రికార్డులు, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికతోనే మృతికి ఖచ్చితమైన కారణం వెల్లడయ్యే అవకాశం ఉంది.

భద్రతపై ప్రశ్నలు ..

ఈ మూడు ఘటనలు వేర్వేరు ప్రాంతాల్లో, వేర్వేరు పరిస్థితుల్లో చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ హోటళ్లలో అతిథుల భద్రతకు సంబంధించిన కొన్ని కీలక అంశాలు మరోసారి తెరపైకి వచ్చాయి.

గుర్తింపు పత్రాల తనిఖీ:

గదులు కేటాయించే ముందు అతిథుల అసలు గుర్తింపు పత్రాలను సక్రమంగా పరిశీలిస్తున్నారా? వాటి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారా?

నకిలీ ఐడీలపై నిఘా:

నకిలీ ఆధార్ వంటి పత్రాలతో ఎవరైనా గదులు పొందకుండా హోటల్ సిబ్బంది తీసుకుంటున్న చర్యలేంటి?

సీసీ కెమెరాల నిర్వహణ:

ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, కారిడార్లు, ఇతర కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా? రికార్డింగ్ భద్రంగా ఉంచుతున్నారా?

అనుమానాస్పద కదలికలపై సమాచారం:

గదిలో అసాధారణ గొడవలు, వ్యక్తుల అనుమానాస్పద రాకపోకలు లేదా ఇతర ఘటనలు కనిపించినప్పుడు హోటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇస్తున్నారా?

అతిథుల వివరాల నమోదు:

చెక్‌ఇన్, చెక్‌అవుట్ వివరాలను సరిగ్గా నమోదు చేయడంతోపాటు గదిలో ఎవరు ఉన్నారనే సమాచారాన్ని హోటల్ యాజమాన్యాలు సమర్థంగా నిర్వహిస్తున్నాయా?

పోలీసుల తనిఖీలకు ప్రాధాన్యం

హైదరాబాద్ పోలీసులు ఇప్పటికే హోటళ్లు, లాడ్జీల్లో అతిథుల వెరిఫికేషన్, రికార్డుల నిర్వహణపై దృష్టి పెట్టారు.

జూన్‌లో నిర్వహించిన 'ఆపరేషన్ కవచ్'లో 562 హోటళ్లు, లాడ్జీలను పోలీసులు తనిఖీ చేశారు. గెస్ట్ రిజిస్టర్లు, ఐడీ వెరిఫికేషన్, చెక్‌ఇన్--చెక్‌అవుట్ వివరాలను పరిశీలించడంతో పాటు సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలని యాజమాన్యాలను ఆదేశించారు. అనుమానాస్ప ద కార్యకలాపాలు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. అందువల్ల తాజా ఘటనల నేపథ్యంలో హోటల్ యాజమాన్యాలు నిబంధనలు పాటిస్తున్నాయా? అతిథుల గుర్తింపు ధ్రువీకరణలో లోపాలున్నాయా? సీసీ కెమెరాల నిర్వహణ ఎలా ఉంది? అనే అంశాలపై అధికారులు మరింతగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

భద్రతపై దృష్టి తప్పనిసరి

హోటల్ అనేది తాత్కాలికంగా బస చేసే ప్రదేశమే అయినా.. అక్కడికి వచ్చే ప్రతి అతిథి భద్రతకు యాజమాన్యాలదే కీలక బాధ్యత. సరైన గుర్తింపు ధ్రువీకరణ, అతిథుల వివరాల నమోదు, పనిచేసే సీసీ కెమెరాలు, సిబ్బందికి భద్రతా ప్రోటోకాల్, అనుమానాస్పద ఘటనలపై తక్షణ పోలీసు సమాచారం వంటి చర్యలు కచ్చితంగా అమలైతే ప్రమాదాలను గుర్తించడంలో, నేరాల దర్యాప్తులో అవి కీలకంగా మారతాయి. తాజా ఘటనలు ఈ అంశాల అమలుపై మరోసారి దృష్టి సారించాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి.

సమ్మెలతో ఫలితం సాధ్యమేనా?

హైదరాబాద్,సమ్మెల గురించి ఉద్యోగులు ఒకటికి రెండు సార్లు ఆలోచించే కాలమిది. అన్ని రంగాల్లో టెక్నాలజీ పెరిగిపోవడంతో ఉద్యోగులు, కార్మికులు అలకబూనినా, సహాయ నిరాకరణ చేపట్టినా.. దాని ప్రభావం పూర్వపు స్థాయిలో ఉండడం లేదు. తమ ప్రయోజనాలకే కాకుండా దేశ ప్రజల సంక్షేమం కూడా దృష్టిలో పెట్టుకొని ఉద్యమించే ఉద్యోగ స్ఫూర్తి వారిలో ఉండేది. ఆ బాధ్యతతో ఉద్యోగులు ఎన్నో ప్రజా ఉద్యమాలకు మద్దతుగా రంగంలోకి దిగిన సందర్భాలున్నాయి. ఇప్పుడు వారి సమస్యల నుండి గట్టెక్కడానికే తిప్పలు పడుతున్నారు. రవాణా, పోస్టల్, బ్యాంకింగ్ తదితర ప్రజాజీవితాలకు ముడిపడి ఉన్న బలమైన రంగాలు సమ్మె తలపెట్టితే ప్రభుత్వాలు దిగివచ్చేవి. ఇప్పుడు మాత్రం సమ్మెకు ఉద్యోగులు వెనకాముందు అవుతున్నారు. ఉద్యోగులు న్యాయమైన హక్కుల కోసం సమ్మెకు దిగితే ప్రభుత్వాలు నిర్దాక్షిణ్యంగా అణచివేసిన సంఘటనలు మన చుట్టూ ఉన్నాయి.మానవ శ్రమ, ప్రమేయం తగ్గి సర్వం యంత్రమయం కావడమే దీనికి కారణం. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు కునారిల్లుతూ, వాటి సంఖ్య తగ్గిపోతూ ఉండగా, అన్ని రంగాల్లో ప్రైవేటుదే పైచేయి కావడం అనేది కార్మిక రంగంపై మరో బలమైన దెబ్బ. దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ కంప్యూటరైజేషన్ అయ్యాక, ప్రైవేటు బ్యాంకులు వచ్చాక ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగుల పట్టు చేజారిపోయింది. ఏడాదికి ఒకట్రెండు సార్లు జరిగే బ్యాంకు సమ్మెలు తగ్గిపోయాయి. యాంత్రీకరణకు ముందు రోజుల్లో కాగితాలపై రాసే లెక్కలు ఉద్యోగుల అధీనంలో ఉండేవి. వారు సమ్మెకు దిగితే ఆర్‌బి ఐకి ఏ సమాచారం అందేది కాదు. యాన్యువల్ క్లోజింగ్ సమయాన ఆ ఆర్థిక సంవత్సరపు లెక్కలు చేయం అని బ్యాంకు సిబ్బంది సమ్మె అస్త్రం ప్రయోగిస్తే ప్రభుత్వం వెంటనే దిగివచ్చేది.దేశ ఆర్థిక గణాంకాలు, లావాదేవీల కదలిక, నగదు చలామణి అంతా ఉద్యోగుల గుప్పిట్లో ఉన్నందున కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ చర్చలకు ఆహ్వానం పంపేది. ఈ కీలక సమయాల్లో ఎన్నో డిమాండ్లను, అలవెన్సులను బ్యాంకు ఉద్యోగులు పట్టుపట్టి సాధించుకున్న సందర్భాలు అనేకం. దశలవారీగా మన దేశంలో ప్రభుత్వ బ్యాంకులు కంప్యూటరీకరణ చెందాయి. 1980 నుండి 1990 దాకా పాక్షికంగా పనులు చేసి పెట్టిన సాఫ్ట్‌వేర్ 2000 నుండి కోర్ బ్యాంకింగ్ సిస్టం ద్వారా అన్ని పనులు కంప్యూటర్లే చేయడం మొదలైంది. ఉద్యోగులు తొలుత బ్యాంకుల కంప్యూటరీకరణను వ్యతిరేకించారు. వద్దని సమ్మెలు కూడా చేశారు. ప్రభుత్వం వారిని మెప్పించేందుకు వేతనంలో అదనంగా కంప్యూటర్ ఇంక్రిమెంట్ కలిపింది.అలా ప్రస్తుతం బ్యాంకింగు రంగం పూర్తిగా పేపర్ ఫ్రీ వ్యవస్థగా మారిపోయింది. ప్రతి కంప్యూటర్ లోని సమాచారం వెనువెంటనే ప్రభుత్వం అధీనంలో ఉండే నియంత్రిత వ్యవస్థలోకి చేరిపోతుంది. బ్యాంకు సిబ్బంది ప్రమేయం లేకుండానే ఆ రోజుటి మొత్తం లావాదేవీలు ప్రభుత్వానికి అందుతాయి. రాత్రంతా డేటా ప్రాసెస్ అయి మర్నాడు ఉదయమే మొత్తం బ్యాంకుల ఆర్థిక ముఖచిత్రం కనబడుతుంది. తన ముందున్న సిస్టమ్‌ను ఆపరేట్ చేయడం తప్ప మరే వ్యవస్థ ఉద్యోగుల నియంత్రణలో లేదు. సమ్మె పేరిట బ్యాంకు సమాచారాన్ని ప్రభుత్వానికి అందించకుండా ఆపే వీలు లేకుండా పోయింది. దీనితో బ్యాంకు ఉద్యోగుల సమ్మె భయం నుంచి ప్రభుత్వం పూర్తిగా బయటపడింది.మరోవైపు ప్రైవేటు బ్యాంకుల ఉధృతి ప్రభావం ప్రభుత్వ రంగ బ్యాంకులపై విపరీతంగా ఉంది. తేలికైన విధానాలతో ప్రైవేటు బ్యాంకు లు అడిగిన వెంటనే గృహ, వాహన రుణాలు ఇస్తూ వ్యాపారాన్ని కైవసం



చేసుకుంటున్నాయి. వారి ప్రతినిధులు ఇంటి వద్దకు వచ్చి డాక్యుమెంట్లపై సంతకాలు తీసుకుంటున్నారు. ఉదయం అడిగితే సాయంత్రం కారు కీస్ చేతికి వస్తున్నాయి. ఈ సౌలభ్యం ప్రభుత్వ బ్యాంకుల్లో సాధ్యం కాదు. రూల్స్ పాటించకపోతే ఉద్యోగానికే ముప్పు. ఆడిట్‌లో ఒక్క కాగితం తక్కువున్నా రిమార్క్. ఈ చట్రంలోంచి ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగి బయటకి రాలేదు. ఇందువల్ల రోజురోజుకు బ్యాంకింగ్ వ్యాపారం ప్రైవేటు శక్తుల చేతిలోకి వెళ్ళిపోతోంది.నేడు దేశంలో నెంబర్ వన్‌గా ఉన్న ఎస్‌బిఐ మార్కెట్ వాటా 23% ఉండగా, మూడు ప్రధాన ప్రైవేటు బ్యాంకుల వాటా కలిపితే 27% అవుతోంది. అనగా హెచ్‌డిఎఫ్‌సి, ఐ సిఐసిఐ, యాక్సిస్ బ్యాంకులు కలిస్తే అదే దేశంలో నెంబర్ వన్ బ్యాంక్ అవుతుంది. మన దేశంలోని బ్యాంకింగ్ వ్యాపారంలో ప్రైవేటు బ్యాంకుల భాగస్వామ్యం డిపాజిట్లలో 37% ఉండగా, అప్పులలో 47 % ఉంది. సుమారు 30 ఏళ్లుగా ఇక్కడ కాలూనిన ప్రైవేటు బ్యాంకులు దేశంలో ప్రైవేటు రంగ ఉద్ధతితోపాటు వృద్ధి చెందుతున్నాయి. సాఫ్ట్ వేర్ ఉద్యోగుల ఖాతాలన్నీ ప్రైవేటు బ్యాంకుల్లోనే ఉంటాయి. దేశంలో ప్రైవేటైజేషన్‌తోపాటు ప్రైవేటు బ్యాంకుల వ్యాపారం కూడా పెరిగిపోతుంది. రాను రాను ప్రభుత్వ బ్యాంకులు ప్రభుత్వ ఖాతాలు, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, వ్యవసాయ రంగ రుణాలు, ప్రభుత్వ పథకాల చెల్లింపులకు పరిమితం కావచ్చు.సెప్టెంబర్ చివరి వారంలో మన దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు వారానికి అయిదు రోజుల పని దినాల కోసం మూడు రోజుల సమ్మెకు ఉపక్రమించారు. కమిటీ వేసి నిర్ణయం తీసుకుంటామని ఐబిఎ చివరి నిమిషంలో ఇచ్చిన ఓ హామీతో అది కార్యరూపం దాల్చలేదు. అన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థల మాదిరే తమకు కూడా ప్రతి వారం శని, ఆదివారాలు సెలవు కావాలనేది వారి ప్రధాన డిమాండ్. 2015 లోనే వేతన సవరణ చర్చల్లో ఈ ప్రస్తావన తెస్తే రెండో, నాలుగో శనివారం సెలవు ఇస్తూ సర్ది చెప్పారు. అన్ని శనివారాలు సెలవు కోసం ఇప్పటికే సెప్టెంబర్ 11న ఒక రోజు సమ్మె చేశారు. 26 అక్టోబర్ 2026 నుండి నిరవధిక సమ్మె చేస్తామంటున్నారు. నిజానికి ఈ డిమాండ్ భారీ సమ్మె ద్వారా సాధించుకొనేంత పెద్దదేమీ కాదు. అందరిలా మాకు కూడా సెలవు వర్తింపచేయండి మహాప్రభో! అంటున్నా ప్రభుత్వం వీరిని ఖాతరు చేయడం లేదు. ఇవ్వం అనడానికి ప్రభుత్వం వద్ద బలమైన కారణం లేకున్నా ఇప్పటికే పదేళ్లుగా నానబెడుతూ వస్తోంది. ప్రభుత్వ కమిటీ ఎప్పటికి, ఏమిటి తేల్చుతుందో కానీ నిరవధిక సమ్మె చేసే శక్తి, దాని ద్వారా ఫలితం వస్తుందన్న నమ్మకం బ్యాంకు ఉద్యోగులకు ఉందా అనేదే అనుమానం.

వైసీపీ ఓటు షేరు ఎందుకు తగ్గింది....

విజయవాడ, ఏపీలో స్థానిక ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎవరి లెక్కల్లో వారు ఉన్నారు. సీట్ల సర్దుబాటు.. ఇతర వ్యవహారాలు జోరుగా సాగుతున్నాయి. సహజంగా కూటమిలో పోటీ అధికంగా ఉంది. వైసీపీలో పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రావడంలేదని వాదనలు ఉన్నాయి. ఇలా సాగుతున్న రాజకీయ వ్యవహారంలో చాణక్య సంస్థ సర్వే నిర్వహించింది. ఈ సర్వే ప్రకారం 2024 తర్వాత 4.37 ఓట్ షేర్ ను వైసిపి కోల్పోయింది.. టిడిపి తో పోల్చితే దాదాపు 11.90 శాతం తేడా ఓటు బ్యాంకు కనిపిస్తోంది. ఎమ్మెల్యేలలో లోకేష్ టాప్ లో ఉన్నారు. 175 నియోజకవర్గాలలో 52, 500 మంది ఓటర్లను పరిశీలించారు. రెండు నెలలపాటు సర్వే నిర్వహించారు. అయితే కూటమి బలం తగ్గడం కాదు కదా.. భారీగా పెరిగింది.2024 లో జరిగిన ఎన్నికలతో పోల్చి చూస్తే చాణక్య సర్వే చెప్పిన దాని ప్రకారం చూస్తే.. టిడిపి ఓటు బ్యాంకు 45. 60% నుంచి 46.90 శాతానికి పెరిగింది. మొత్తంగా ఓటు బ్యాంకు 1.30 శాతానికి పెరిగింది. వైసీపీకి 2024 ఎన్నికల్లో 39.37 ఓటు బ్యాంకు లభించింది. ఇప్పటికి అది 35% పడిపోయింది. జనసేనకు నాడు ఓటు బ్యాంకు 8.53 శాతం గా ఉంది. ఇప్పుడు అది తొమ్మిది శాతానికి చేరుకుంది. మొత్తంగా 0.47 ఓటు శాతం పెరిగింది. బిజెపికి 2.83 శాతం ఉండగా.. ఇప్పుడు అది 3.5 జీరోకి జరిగింది. మొత్తంగా 0.67 శాతం ఓటు బ్యాంకు పెరిగింది. ఇక ఇతరులు 3.67 నుంచి 5.60 వరకు శాతాన్ని పెంచుకున్నారు.మొత్తంగా మూడు పార్టీల ఓటు షేర్ దాదాపు 57% నుంచి 59.4 శాతానికి చేరుకుంది. అధికారులకు వచ్చిన తర్వాత ఓటు బదిలీ మరింత బలపడింది. 4.37 పాయింట్ల ఫలితమే ఈ సర్వేలో అతిపెద్ద మార్పు. ఓటు షేర్ 35% పడిపోయింది. రప్పా రప్పా నినాదాలు మాత్రమే చెబుతున్న వైసిపి నాయకులు.. ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం వల్లే ఈ సమస్య ఎదురయిందని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికైనా పకడ్బందీగా వ్యవహరించకపోతే 35 శాతం ఓటు బ్యాంక్ కూడా తగ్గిపోతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ గణాంకాలు చూస్తే వైసిపి కోల్పోవడం కష్టంగానే కనిపిస్తోంది.వైసిపి కోల్పోయిన ఓట్లలో కొంత భాగం ఇతరుల వైపు వెళ్ళింది. అటు కూటమి.. ఇటు వైసీపీ మీద అసంతృప్తితో ఉన్నవారు కాంగ్రెస్ లాంటి ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. ఎమ్మెల్యేలలో లోకేష్.. కోటం.. పవన్ కళ్యాణ్ వరుసగా టాప్ మూడు స్థానాలలో ఉన్నారు. ఇక వైసిపి ఎమ్మెల్యేలలో చివరికి జగన్ తో ఎవరూ పెద్దగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెంగళూరు నుంచి వచ్చిన తర్వాత మాత్రమే జగన్ పులివెందులలో హడావిడి చేస్తున్నారని.. ఆ తర్వాత జనాల బాధలను పట్టించుకునేవారు లేరని సర్వేలో తేలింది.మంత్రులుగా ఉన్నప్పటికీ పవన్ కళ్యాణ్ పిఠాపురం విషయంలో.. లోకేష్ మంగళగిరి విషయంలో మరింత దూకుడు ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది. చంద్రబాబు అయితే కుప్పం విషయంలో వారానికి రెండు రోజులు సమయం కేటాయిస్తున్నారని.. ముఖ్యమంత్రిగా ప్రతిరోజు కుప్పం వెళ్లడం సాధ్యం కాదు కాబట్టి.. ఆయన నియమించుకున్న ప్రతినిధుల ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు.. ముఖ్యమంత్రి అయిన తర్వాత కుప్పం విషయం

మందు తాగడంలో మన తెలంగాణోళ్లను మించినోళ్లు లేరబ్బా..



హైదరాబాద్: మద్యం వినియోగంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 15 ఏళ్ల పైబడిన పురుషుల్లో ఏకంగా 43.9 శాతం మంది మద్యం సేవిస్తున్నట్లు చీఖీనూ-6 సర్వే గణాంకాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా ఇదే వయసు పురుషుల్లో మద్యం వినియోగం సగటు 18.9 శాతంగా ఉండగా.. తెలంగాణలో నమోదైన శాతం దానికి రెండింతలకు పైగా ఉండటం గమనార్హం. ఈ గణాంకాలు రాష్ట్రంలో మద్యం వినియోగం ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేస్తున్నాయి.చీఖీనూ-6 గణాంకాల ప్రకారం.. మద్యం వినియోగంలో తెలంగాణ తర్వాత రాజస్థాన్ రెండో స్థానంలో ఉంది. ఆ రాష్ట్రంలో 15 ఏళ్ల పైబడిన పురుషుల్లో 42.2 శాతం మంది మద్యం సేవిస్తున్నట్లు నమోదైంది. 38.3 శాతంతో ఛత్తీస్‌గఢ్ మూడో స్థానంలో ఉండగా.. 33.6 శాతంతో జార్ఖండ్ నాలుగో స్థానంలో, 26.9 శాతంతో మధ్యప్రదేశ్ ఐదో స్థానంలో నిలిచాయి. ఈ రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మద్యం వినియోగం గణనీయంగా ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

గ్రామాల్లోనే ఎక్కువ

తెలంగాణలో పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో మద్యం వినియోగం అధికంగా ఉండటం మరో కీలక అంశంగా మారింది. పట్టణ ప్రాంతాల్లో 15 ఏళ్ల పైబడిన పురుషుల్లో మద్యం వినియోగం 36.3 శాతంగా ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 46.6 శాతంగా నమోదైంది. అంటే నగరాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో మద్యం సేవించే వారి శాతం దాదాపు 10 శాతం పాయింట్లు ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం వినియోగాన్ని తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు, ప్రజారోగ్య చర్యలు మరింత అవసరమనే చర్చకు ఈ గణాంకాలు దారితీస్తున్నాయి.

మహిళల్లోనూ వినియోగం

మద్యం వినియోగం పురుషులకు మాత్రమే పరిమితం కావడం లేదని NFHS-6 గణాంకాలు సూచిస్తున్నాయి. మహిళల్లోనూ మద్యం సేవించే వారి శాతం నమోదైంది. తెలంగాణలో మహిళల మద్యం వినియోగం 7.1 శాతంగా ఉండగా.. ఈ విభాగంలో రాజస్థాన్ 19.9 శాతంతో మొదటి స్థానంలో ఉంది. తెలంగాణ 7.1 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. ఛత్తీస్‌గఢ్‌లో 5.7 శాతం, జార్ఖండ్‌లో 5.5 శాతం, మధ్యప్రదేశ్‌లో 1.6 శాతం మహిళలు మద్యం సేవిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు

మొత్తంగా చూస్తే తెలంగాణలో పురుషుల్లో మద్యం వినియోగం జాతీయ సగటుతో పోలిస్తే చాలా అధికంగా ఉండటం, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం మరింత ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. మహిళల్లోనూ వినియోగం పెరుగుతున్నట్లు కనిపించడం మరో ముఖ్య పరిణామం. మద్యం అధికంగా తీసుకోవడం కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఆరోగ్యం, సామాజిక జీవనంపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో.. ఈ గణాంకాల నేపథ్యంలో మద్యం వినియోగ నియంత్రణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జ్ఞానేష్ పై కేసులు తప్పుతున్న కాంగ్రెస్



న్యూఢిల్లీ,భారత ఎన్నికల సంఘంలో అత్యంత వివాదాస్పద కమిషనర్ గా పేరొందిన జ్ఞానేష్ కుమార్ చుట్టూ ఉచ్చు బిగుసుకుంటుంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మేలు చేకూరే విధంగా 13 కోట్ల ఓట్లు తొలగించారని తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న జ్ఞానేష్ కుమార్ ను అరెస్టు చేయాలని కాంగ్రెస్, వామపక్ష పార్టీలు, సీజేపి డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ జ్ఞానేష్ కు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపట్టింది. ముంబై శివాజీ పార్క్ లో సీజేపి ఆందోళన చేస్తోంది. అయినా సరే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం జ్ఞానేష్ కు గుడ్డిగా కాపు కాస్తుంది.ఈ మొత్తం పరిణామాల నేపథ్యంలో జ్ఞానేష్ వ్యవహారంలో తాడో పేడో తేల్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్దమయ్యింది. ఇందులో భాగంగా జ్ఞానేష్ మీద వున్న పాత కేసుల్ని బయటకు తీసింది. దీంతో ఢిల్లీ రాజకీయాలు మరింత తీవ్ర దశకు చేరుకున్నాయి. అధికార బీజేపీ ప్రతిపక్ష కాంగ్రెస్ కూటముల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. దీన్ని దేశంలోని సామాన్య ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఇంతకూ ఏమైందంటే...1988 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి జ్ఞానేష్ కుమార్ 2006లో కేరళ ప్రభుత్వంలో పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూ) సెక్రటరీగా పనిచేసిన విషయం తెలిసిందే కదా. ఆయన హయాంలో పీడబ్ల్యూ శాఖలో భారీగా అవినీతి, అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. విపక్షాలే కాకుండా కాగ్ రిపోర్ట్ కూడా ఆయనను తప్పు పట్టింది. కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్ రోడ్డు పనుల నిధుల మళ్లింపు, కాంట్రాక్టు నిబంధనల మార్పు ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు 92 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక ఇచ్చింది.ఇపుడీ విషయాన్ని కేరళం కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ బయటకు తీసింది. కేరళం పీసీసీ అధ్యక్షులు మలయంకీజు వేణుగోపాల్ ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన కేరళం హోంమంత్రి రమేష్ చెన్నితల విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో విచారణకు ఆదేశించారు. నిజానికి సీఈసీగా జ్ఞానేష్ కుమార్ ను నియమించినప్పుడే ఈ ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. అపుడు దాన్ని కాంగ్రెస్ పార్టీ కూడా పెద్దగా పట్టించుకోలేదు. అయితే ఎన్నికల కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన జ్ఞానేష్ కుమార్ మాత్రం విచ్చలవిడిగా ఎన్నికల అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కున్నారు. అధికారికంగా ఎన్నికల రిగ్గింగ్ కు పాల్పడినట్లు కాంగ్రెస్, సీజెపి ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆయన మీద వున్న కేసులను బయటకు తీయాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది.కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్ రోడ్డు ప్రాజెక్టు కేసులో మరో ట్విస్ట్ కూడా వుంది. కేఎస్టీపీ ప్రాజెక్టు పనుల్లో భాగంగా మలేషియాకు చెందిన సివిల్ ఇంజనీర్ లీ సీ బీన్ అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్నారు. సూసైడ్ నోట్లో అప్పటి పీడబ్ల్యూడీ సెక్రటరీ జ్ఞానేష్ కుమార్ పేరు కూడా ప్రస్తావించారు. నిధుల విడుదల కోసం జ్ఞానేష్ కుమార్ లంచం డిమాండ్ చేశారని, మానసికంగా వేధించారని ఆరోపిస్తూ లీ సీ బీన్ తన భార్యతో పాటుగా కంపెనీ డైరెక్టర్‌కు లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్నారు. దీన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విచారించే అవకాశం వుందని వార్తలు వస్తున్నాయి.

రేవంత్‌పై బీఆర్ఎస్ బినామీ అస్త్రంలో బలముందా?



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ఆస్తుల యుద్ధం భారత రాష్ట్ర సమితిని ఆత్మరక్షణలోకి నెట్టేసింది. కేటీఆర్ కుటుంబానికి హైటెక్ సిటీ, మాదాపూర్ పరిసరాల్లో ఉన్న స్టార్ హోటళ్లు, వాణిజ్య భవనాలు, సర్వీస్డ్ అపార్ట్‌మెంట్ల వివరాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా బహిర్గతం చేయడం గులాబీ పార్టీకి పెద్ద షాక్‌గా మారింది. రేవంత్ బయటపెట్టిన వివరాలన్నీ రికార్డుల్లో ఉండటంతో అవి మావి కావు అని ఖండించే అవకాశం లేకుండా పోయింది. చివరకు మాకు హోటళ్లు ఉన్న మాట వాస్తవమే, వ్యాపారం చేయడం తప్పా అని కేటీఆర్ స్వయంగా మీడియా ముందు ఒప్పుకోవాల్సి రావడం ద్వారా కాంగ్రెస్ వేసిన ట్రాప్‌లో బీఆర్ఎస్ చిక్కుకుందని అందరికీ అర్థమైంది.దీని నుంచి బయటపడేందుకు బీఆర్ఎస్ అనుసరిస్తున్న రివర్స్ ఎటాక్ రాజకీయంగా ఏమాత్రం బ్యాలెన్స్ చేయలేకపోతోంది. రేవంత్‌రెడ్డి కుటుంబంపై రివర్స్‌లో రూ. వేల కోట్ల అవినీతి ఆరోపణలు గుప్పిస్తే సరిపోతుందన్న భ్రమలో గులాబీ పార్టీ అధికార ప్రతినిధులు హడావుడి చేస్తున్నారు. అయితే, కేటీఆర్ ఆస్తుల వ్యవహారంలో రేవంత్ ఎక్కడా ఊహాజనిత బినామీల పేర్లు ప్రస్తావించకుండా నేరుగా అధికారిక రికార్డులనే ఆధారంగా చేసుకున్నారు. దానికి పూర్తి విరుద్ధంగా.. బీఆర్ఎస్ మాత్రం ఎవరో వ్యాపారవేత్తలు, మహిళల పేర్లను తెరపైకి తెచ్చి వీరంతా రేవంత్‌రెడ్డికి బినామీలు అంటూ చేస్తున్న ప్రచారానికి అంత ప్రాధాన్యత లభించడం లేదు.ముఖ్యంగా మెడికవర్ హాస్పిటల్స్ కొనుగోలు, విక్రయాల వ్యవహారాన్ని రేవంత్‌కు ముడిపెట్టే ప్రయత్నం బీఆర్ఎస్ వ్యూహంలోని డొల్లతనాన్ని ఎత్తిచూపుతోంది. మెడికవర్ , సహృదయ సంస్థలు గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలోనే హైదరాబాద్‌లో విశేషంగా విస్తరించి, కార్పొరేట్ స్థాయికి ఎదిగాయన్నది బహిరంగ వాస్తవం. అంతర్జాతీయ స్థాయి కార్పొరేట్ కంపెనీలు వాటాలు మార్చుకోవడం , హాస్పిటల్ చైన్‌లను విక్రయించడం వంటి సాధారణ వ్యాపార లావాదేవీలను రేవంత్‌రెడ్డి బినామీ పెట్టుబడులుగా చిత్రీకరిస్తే ప్రజలు నమ్మడం కష్టం.రాజకీయాల్లో ప్రత్యర్థిపై చేసే ఆరోపణలకు విశ్వసనీయత ఉండాలంటే పక్కా ఆధారాలు తప్పనిసరి. కేటీఆర్ ఆస్తుల విషయంలో రేవంత్‌రెడ్డి స్పష్టమైన వివరాలను ప్రజల ముందు ఉంచినట్లే.. రేవంత్‌రెడ్డి కుటుంబం అధికారంలోకి వచ్చిన ఈ స్వల్ప కాలంలో లేదా గత రెండేళ్లలో అక్రమంగా సంపాదించిన నిర్దిష్టమైన ఆస్తుల వివరాలను బీఆర్ఎస్ నిరూపించగలగాలి. అలా కాకుండా, ఎవరికో చెందిన వ్యాపారాలను, బినామీలను ముడిపెడుతూ కేవలం ప్రెస్ మీట్లలో సంచలన ప్రకటనలకే పరిమితమైతే.. అది కేవలం బురదజల్లే రాజకీయమే అని ప్రజలు తేల్చేస్తారు. ఇప్పుడు అదే జరుగుతోంది.

తెలంగాణలో బీజేపీ బలోపేతానికి కొత్త టీమ్.. ఇన్‌చార్జ్‌ల నియామకం



మారుతున్న రాజకీయ పరిణామాలపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే దిశగా అగ్రనేతలు దిశానిర్దేశం చేయనున్నారు.

ప్రతిష్టాత్మకంగా ఎమ్మెల్సీ మరియు ఉపఎన్నికలు

రానున్న కాలంలో జరగబోయే ఖైరతాబాద్ ఉపఎన్నికతో పాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను బీజేపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికల్లో నత్తా చాటడం ద్వారా రాష్ట్రంలో తమ రాజకీయ ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలని పట్టుదలగా ఉంది. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను ఎండగడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపేలా కమల దళం పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది.

హైదరాబాద్, రాబోయే ఎన్నికలను అత్యంత వ్యూహాత్మకంగా ఎదుర్కొనేందుకు భారతీయ జనతా పార్టీ తెలంగాణలో తన రాజకీయ క్రీడను మరింత ఉత్సాహం చేసింది. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేసేందుకు మరియు పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపేందుకు జాతీయ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే రాష్ట్ర రాజకీయ సమీకరణాలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు కీలకమైన మార్పులకు శ్రీకారం చుట్టింది.

నూతన నాయకత్వానికి కీలక బాధ్యతలు

తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపై పూర్తి పట్టు సాధించే లక్ష్యంతో బీజేపీ అధిష్టానం కీలక నియామకాలు చేపట్టింది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా అనుభవజ్ఞుడైన సునీల్ బన్సల్‌ను నియమించగా, ఆయనకు సహకారంగా అభయ్ పాటిల్ మరియు రేఖా శర్మలను సహ ఇన్‌చార్జ్‌లుగా బాధ్యతలు అప్పగించారు. ఈ నూతన నాయకత్వ బృందం రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు

పదాధికారుల సమావేశం – భవిష్యత్ కార్యాచరణ

ఈ రాష్ట్ర పదాధికారుల అత్యవసర సమావేశం పార్టీ పరంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, ప్రతిష్టాత్మక 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమం మరియు రాష్ట్రంలో

బాలాపూర్ ప్లాస్టిక్ గోదాంలో అగ్నిప్రమాదం..

రంగారెడ్డి , సోమవారం తెల్లవారు జామున రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌లోని రాయల్ కాలనీలో ప్లాస్టిక్ గోదాంలో అగ్నిప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు సమాచారమందించడంతో ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.ఇవాళ ఉదయం 3 గంటలకు ప్లాస్టిక్ గోదాంలో మంటలు చెలరేగుతున్నాయని మాకు ఫోన్ కాల్ వచ్చింది. హయత్ నగర్, చంద్రాయణ గుట్ట నుంచి రెండు అగ్నిమాపక యంత్రాలు ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి.. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు.. దర్యాప్తు కొనసాగుతుందని అగ్నిమాపక శాఖ అధికారి ఒకరు తెలిపారు.

జహీరాబాద్ రైల్వే స్టేషన్‌కు ఆధునిక హంగులు..



జహీరాబాద్,70 ఏళ్ల చరిత్ర కలిగిన జహీరాబాద్ రైల్వే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక అమృత్ భారత్ స్టేషన్ పథకంలో ఎంపికై రూ.20 కోట్లతో ఆధునిక హంగులతో ముస్తాబవుతోంది. పనులు తుది దశకు చేరి ప్రారంభానికి సిద్ధమవుతోంది.

ఎంపిక నుంచి అభివృద్ధి వరకు:

దేశవ్యాప్తంగా 1000 స్టేషన్లను ఆధునీకరించేందుకు కేంద్రం ఈ పథకాన్ని తెచ్చింది. తెలంగాణలో 39 స్టేషన్లకు అవకాశం దక్కగా.. ఉమ్మడి మెదక్ జిల్లాలో అతిపెద్దదైన జహీరాబాద్ కు చోటు లభించింది. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని వికారాబాద్-పర్లీ మార్గంలో ఈ స్టేషన్ కీలకం. రోజూ 18 ప్యాసింజర్, 12 గూడ్స్ రైళ్లు, వెయ్యి మందికి పైగా ప్రయాణికుల రాకపోకలతో సందడిగా ఉంటుంది.

కోట బురుజులతో స్వాగతం:

స్టేషన్ ముఖద్వారమే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. జహీరాబాద్ చరిత్రకు ప్రతీక అయిన కోట బురుజుల తరహాలో ఎర్ర ఇటుక కంగురాలతో ఆర్చ్ ను నిర్మించారు. స్టేషన్ ప్రహరీ గోడ కూడా అదే డిజైన్ తో నిర్మించి చారిత్రక శోభను తీసుకొచ్చారు.

ఫాసిజం పాలన ప్రారంభమైందా?..



న్యూఢిల్లీ, భారత్ ఇప్పటికే ఫాసిజం అనే అగ్నిపరీక్షలో ఉందా? మన దేశంలో కూడా తీవ్ర జాతీయ వాదం, అధికారం ఒక పార్టీ చేతిలో కేంద్రీకృతం కావడం, ప్రతిపక్షాన్ని అణచివేయడం, మీడియా, ప్రజలపై నియంత్రణ, నిరసనలపై రక్షణ దళాలతో ఉక్కుపాదం మోపడం, జెన్ జీ వర్గాలపై కూడా పాశవిక చర్యలకు పాల్పడటం చూస్తుంటే మన దేశంలో ఫాసిజం అడుగుపెట్టిందన్న అనుమానాలు కలుగుతున్నాయని సీనియర్ జర్నలిస్ట్ ఆనంద్ కే సహాయ్ 'ద వైర్' వెబ్‌సైట్‌లో అభిప్రాయపడ్డారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై దేశ వ్యాప్తంగా వెల్లువెత్తుతున్న నిరసనలు, ఆందోళనల అణచివేతకు ప్రభుత్వం పాల్పడుతున్న నిరంకుశ వైఖరులపై ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. దేశంపై పూర్తి నియంత్రణతో ఒక నాయకుడు లేదా ప్రభుత్వం ప్రజల స్వేచ్ఛను పరిమితం చేయడం, ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వారిని అణచివేయాలనే భావజాలాన్నే ఫాసిజం అంటారు. ఇప్పుడు మన దేశంలో ఫాసిజం పరిస్థితులు ఏర్పడుతున్నాయన్న ఆందోళనను మేధావులు వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల సంఘానికి కళంకం

ప్రజాస్వామ్యానికి గర్వంగా నిలిచేలా స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలు నిర్వహించి పర్యవేక్షించడానికి రాజ్యాంగం ద్వారా ఏర్పడిన పవిత్రమైన సంస్థే భారత ఎన్నికల సంఘం (ఈసీఐ). అయితే ఆ ఎన్నికల సంఘానికి ఇప్పుడు కళంకం అంటుకుంది. భారతదేశంలో ఫాసిజం పాతుకుపోయేలా చేసే భారీ యంత్ర పరికరాల తయారీ కర్మాగారంగా మారిందన్న తీవ్ర విమర్శ దానిపై ప్రారంభమైంది.

ప్రశ్నించే గొంతుల అణచివేత

ప్రభుత్వ చర్యలను ప్రశ్నించే గళాలను అణచివేయడమే లక్ష్యంగా కేంద్రం పనిచేస్తున్నది. ఇప్పటికే ప్రధాన మీడియాలో మెజారిటీ భాగాన్ని తన చెప్పుచేతల్లో ఉంచుకున్న ప్రభుత్వం ప్రశ్నించే సోషల్ మీడియాపై ఉక్కుపాదం మోపుతున్నది. నీట్ అక్రమాలపై ప్రశ్నిస్తూ రోడ్డెక్కిన జెన్ జీ ఉద్యమాన్ని నిరంకుశంగా అణచివేయడానికి ప్రయత్నించింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ ఢిల్లీలో విపక్షాలు, ముంబైలో కాక్రోచ్ జనతా పార్టీలు నిర్వహించిన ఆందోళనలను అణచివేయడానికి ప్రభుత్వం శాయశక్తులా కృషి చేసింది.

'సర్'పై సామాన్యుడి ప్రశ్నలకు బదులేది?

గత 20, 30 ఏండ్లుగా ఎన్నోసార్లు ఓటు వేసిన పౌరుల ఓటు హక్కును ఇటీవల 'సర్' పేరిట తొలగించడం ఆశ్చర్యం, షాక్‌కు గురిచేసింది. ఇదేంటి దశాబ్దాల పాటు ఓటేస్తున్నాం కదా, పేరెందుకు తొలగించారు? అని అడిగిన పౌరులకు సరైన సమాధానం చెప్పే వారే కరువయ్యారు. సర్ పేరిట ఒక వర్గం వారి ఓట్లను తొలగిస్తున్నారన్న ఆరోపణలకు కూడా ఈసీఐ నుంచి సమాధానం లేదు.బంగ్లాదేశ్, మయన్మార్ లాంటి అక్రమ వలసదారులను ఏరివేయడానికి ఇది ఎంతో ప్రయోజనకారి అం టున్న కేంద్రం అలా ఎంతమందిని తొలగించారో వివరణ ఇవ్వడం లేదు. ఇటీవల జరిగిన సర్‌లో డూప్లికేట్, మరణించిన వారి ఓటర్లను తొలగించామని చెబుతున్నా.. అలాంటి వారి సంఖ్య రెండు నుంచి ఐదు శాతం మాత్రమేనని డాటా చెబుతున్నది.

ఒక్క పిల్లర్‌పైనే వైసీపీ భారం... !

అమరావతి,వైసీపీ... ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ప్రధానంగా చర్చకు వస్తున్న పార్టీ. ఈ పార్టీ ప్రభావం నానాటికి తగ్గిపోతోందన్న వాదన ఒకవైపు వినిపిస్తుండగా.. మరింత లోతుగా పార్టీ అధ్యయనం చేస్తోంది. ఒకప్పుడు 4 కీలక అంశాల ఆధారంగా వైసీపీ ప్రజలకు చేరువ అయింది. అయితే.. వాటిలో మూడు అంశాలు తుడిచి పెట్టుకుపోగా.. ఇప్పుడు కేవలం ఒకే ఒక్క అంశం మిగిలింది. ఈ ఒక్కటే పార్టీకి దశ-దిశ.. అన్నట్టుగా ఉంది. అయితే.. ఇది కూడా పోయే ప్రమాదం ఏర్పడుతోందన్నది పార్టీలో నాయకులు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు.

ఇవీ 3 పిల్లర్లు..

సంక్షేమం: వైసీపీకి ఆది నుంచి కూడా సంక్షేమ పార్టీగానే ముద్ర పడింది. 2019కి ముందు.. మాజీ సీఎం తనయుడిగా ఒక్క ఛాన్స్ అంటూ.. జగన్ ప్రజలను మురిపించి ప్రభుత్వంలోకి వచ్చారు. ఆ తర్వాత.. తన సర్కారుపై ఆయన సంక్షేమ ముద్ర వేసుకున్నారు. కులం చూడం, మతం చూడం, పార్టీలు చూడమంటూ.. సంక్షేమానికి, మేనిఫెస్టోకు ప్రాధాన్యం ఇచ్చారు. కానీ, ఇప్పుడు కూటమి సర్కారు కూడా ఇదే పాటిస్తోంది. పైగా జగన్ కంటే కూడా.. ఎక్కువగానే సంక్షేమాన్ని అమలు చేస్తోంది. దీంతో సంక్షేమం అనే పిల్లర్ వైసీపీ నుంచి దాదాపు పోయింది.సామాజిక వర్గాలు: వైసీపీకి మరో ప్రాణాధారమైన విషయం..సామాజిక వర్గాలు. 2019కి ముందు.. రెడ్డి, ఎస్సీ, ఎస్టీ వర్గాలు వైసీపీకి అండగా ఉన్నాయి. దీంతో అప్పట్లో అధికారంలోకి వచ్చేశారు. కానీ, తర్వాత.. కాలంలో రెడ్డి నాయకులు తీవ్ర అసంతృప్తి చెందారు. ఎస్సీ, ఎస్టీలకు మేలు చేసినా.. వారిలో 50 శాతం మంది మాత్రమే వైసీపీ వైపు నిలిచారు. ఇక, ఇప్పుడు.. పవన్ కల్యాణ్ దూకుడుతో ఎస్టీలు, టీడీపీ దూకుడుతో ఎస్సీలు,



మైనారిటీలు కూడా వైసీపీకి దూరమయ్యారు. ఇక, రెడ్లు మాత్రమే వైసీపీవైపు 50 శాతం నిలిచారు. దీంతో ఈ పిల్లర్ కూడా.. దాదాపు కూలిపోయింది. కుటుంబం: వైసీపీకి, ముఖ్యంగా జగన్‌కు కుటుంబ రాజకీయాలు కలిసి వచ్చాయి. మాతృమూర్తి విజయమ్మ సహా సోదరి షర్మిలలు.. 2019 ఎన్నికలకు ముందు ప్రచారం చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కుటుంబంలో చీలికలు పేలికలు అయ్యాయి. దీంతో కుటుంబం అనే బలమైన పిల్లర్ జగన్‌కు దూరమైంది. ఫలితంగా.. ఈ విషయంలోనూ ఆయన మైనస్ అయ్యారు.

ఉన్నది ఒక్కటే..!

4) ఇమేజ్: జగన్‌కు ఉన్న మాస్ ఇమేజ్ ఒక్కటి మాత్రమే ఇప్పుడు బలంగా ఉంది. ఆయన పార్టీ ఓడిపోయి.. అధికారం కోల్పోయినా.. ఈ ఇమేజ్ ఒక్కటే ఉంది. అయితే.. దీనిని కాపాడుకునే ప్రయత్నాలు జరుగుతున్నా.. ఆయన చేస్తున్న ప్రకటనలు.. వేస్తున్న అడుగులు.. దీనిని నిలబెడతాయా? లేదా? అనేది ముఖ్యం.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140